

జాళ్లపాలెం గ్రామంలో ఇంకుడు గుంత పనులకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

టీడీపీ కూటమి పాలనలో వైసీపీ కార్యకర్తలకు పండుగ నెలకొంది. ఏడాది క్రితం వారు చేసిన జడ్పీ పనులకు పూర్తిగా బిల్లుల చెల్లింపులు జరిగాయి. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు ఇప్పటివరకూ బిల్లులు రాలేదు. ఉపాధి హామీ పథకం నూరుశాతం నిధులతో చేసిన పనులకు కూడా ఏడేళ్లుగా బిల్లులు అందక తమ్ముళ్లు తీవ్రంగా నష్టపోయారు. దీంతో టీడీపీ కేడర్ ప్రభుత్వ తీరు పట్ల ఆగ్రహంతో రగిలిపోతోంది. ప్రస్తుతం వైసీపీ అధికారంలో ఉందా? టీడీపీ అధికారంలో ఉందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పలువురు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.



అలా.. పంచేశారు!

కూటమి పాలనలో వైసీపీ కార్యకర్తలకు పండుగ

- ఏడాది క్రితం చేసిన జడ్పీ పనులకు బిల్లుల చెల్లింపు
- వారికే సహకరిస్తున్న ప్రస్తుత అధికారులు
- గత టీడీపీ పాలనలో చేసిన వాటికి నేటికీ రాని వైనం
- ప్రభుత్వ తీరుపట్ల రగిలిపోతున్న తెలుగు తమ్ముళ్లు


దర్శి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్ నిధుల కేటాయింపులో అగ్రతాంబూలం దర్శి నియోజకవర్గానికే దక్కింది. దర్శి నుంచి కుమారుడిని పోటీ చేయించాలన్న ముందుచూపుతో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధిక నిధులు ఇచ్చారు. 2019 నుంచి 2024 వరకు రూ.18.60 కోట్లను 362 పనులకు కేటాయించారు. ఎన్నికలకు ముందు 2023-24 ఒక్క సంవత్సరంలోనే అందులో 172 పనులు మంజూరు చేయడం విశేషం. మొత్తం 362 పనుల్లో 345 పూర్తయ్యాయి. 17 పనులు ప్రారంభించలేదు. చేసిన 345 పనులకు రూ.13.15 కోట్ల బిల్లులు ఇప్పటికే చెల్లించారు. పనులు చేసిన వైసీపీ కార్యకర్తలకు అధికారులు చెక్కులు రాసివ్వడంతో వాటిని మార్చుకొని ఆనందంగా ఉన్నారు. ఏడు సంవత్సరాల క్రితం చేసిన పనులకు బిల్లుల కోసం ఎదురుచూస్తున్న టీడీపీ శ్రేణులు ఈ పరిస్థితి చూసి అవాక్కవుతున్నాయి. తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సతమతమవుతున్నాయి.

టీడీపీ నాయకుల ఫిర్యాదులు.. పట్టించుకోని అధికారులు

జడ్పీ పనుల కేటాయింపు, నిర్వహణలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ కమిటీ వేసి వాస్తవాలు నిగ్గుతేల్చాలని టీడీపీ నాయకులు పలుసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ జిల్లా అధికారులు పట్టించుకోలేదు. పనులు కేటాయించిన జడ్పీ సీఈవో ఎన్నికల అనంతరం బదిలీ అయ్యారు. ఆ తర్వాత వచ్చిన అధికారి పనుల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటారని భావించినప్పటికీ ఆయన కూడా వైసీపీకి అనుకూలంగానే వ్యవహరించి నిధుల విడుదలకు బాగా సహకరించారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జడ్పీ పనుల కేటాయింపులో జరిగిన అక్రమాలు, బిల్లుల చెల్లింపులపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వివరించి తప్పుచేసిన అధికారులపై తగిన చర్యలు తీసుకునే విధంగా ఒత్తిడి తీసుకురావాలని టీడీపీ నాయకులు భావిస్తున్నారు.

పనుల కేటాయింపులో నిబంధనలకు పాతర

జిల్లా పరిషత్ నిధులతో పనుల కేటాయింపులో నిబంధనలకు పాతర వేశారు. మౌలిక సూత్రాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా 90శాతం మట్టి పనులు ప్రతిపాదించారు. అధికారులు కూడా నోరు మెదపకుండా ఆమోదముద్ర వేశారు. ఆ పనులను వైసీపీ కార్యకర్తలకు పందేరం చేయడంతో నామమాత్రంగా నాలుగు తట్టలు మట్టి పోసి మమ అనిపించారు. ఎంతమేరకు చేశారన్న విషయాన్ని పరిశీలించకుండా పూర్తిగా పనులు చేసినట్లు అధికారులు బిల్లులు చేశారు. ఊహించని విధంగా అరకొర పనులకు కూడా నిధులు విడుదలై చెక్కులు చేతికి రావడంతో వైసీపీ కేడర్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఉదాహరణకు లక్ష రూపాయల పెట్టుబడి పెట్టిన వారికి రూ.7.5లక్షల వరకు రావడంతో వైసీపీ కార్యకర్తలు హుషారుగా తిరుగుతున్నారు.



జడ్పీ నిధులతో తూర్పువెంకటాపురం పొలాల్లో తూతూమంత్రంగా మరమ్మతులు చేసిన రోడ్డు (ఫైల్)

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర

నేడు జిల్లావ్యాప్తంగా 15వేల ఇంకుడు గుంతల పనులు ప్రారంభం

జాళ్లపాలెంలో పాల్గొననున్న మంత్రి స్వామి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సుమారు 15వేల ఇంకుడు గుంతలకు శంకుస్థాపనలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8గంటలకు కొండపి మండలం పెదకండ్లగుంట పంచాయతీ పరిధిలోని జాళ్లపాలెంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పనులను ప్రారంభించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు చేశారు. వీటిని శుక్రవారం డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు, కొండపి ఎంపీడీవో రామాంజనేయులు పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో స్థానిక శాసనసభ్యులు, ఇన్‌చార్జిలతో పాటు అధికారులు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

'స్వచ్ఛాంధ్ర'లో జిల్లా వెనుకబాటు

రాష్ట్రంలో 22వ స్థానం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్రలో జిల్లా వెనుకబడింది. 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ర్యాంకులు ప్రకటించారు. మొత్తం 200 పాయింట్లతో ఎన్‌టీఆర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 127 పాయింట్లతో విశాఖ రెండో స్థానంలో, 125 పాయింట్లతో తూర్పు గోదావరి జిల్లా 3వస్థానంలో ఉంది. ప్రకాశం జిల్లా 99 పాయింట్లతో 22వస్థానంలో నిలిచింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్‌శాఖ చేపట్టిన కార్యక్రమాలపై సంబంధిత అధికారులు ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చారు. మొత్తం 14 ఇండికేటర్స్‌కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాల్లో జిల్లా వెనుకబడి ఉంది. పట్టణాభివృద్ధిశాఖ పరిధిలో డోర్ టూ డోర్ కలెక్షన్‌కు 15 పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్‌కు 35 పాయింట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్‌కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు ఇచ్చారు. పంచాయతీరాజ్ శాఖలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్లకు 10 పాయింట్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్‌కు 10 పాయింట్లు, నూరుశాతం డోర్ టు డోర్ చెత్త కలెక్షన్‌కు 10 పాయింట్లు, ఓడీఎఫ్ ప్లస్ మోడల్‌కు 10 పాయింట్ల చొప్పున కేటాయించారు. ఇలా మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లాల ప్రోగ్రెస్‌పై ర్యాంకులు ఇచ్చారు. అలా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో జిల్లా 22వ స్థానంలో నిలిచింది.



వార్డు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, పక్కన నోడల్ అధికారి బాషా

విధుల్లో లేని సెక్రటరీలపై చర్యలు

- గాంధీనగర్, శివప్రసాద్ కాలనీ సచివాలయాలను తనిఖీ చేసిన కమిషనర్
- డుమ్మాకొట్టిన వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశం

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవలందించాల్సిన సచివాలయ సెక్రటరీలు ఫీల్డు పేరుతో విధులకు డుమ్మా కొట్టారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గతనెల 28న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నగరంలోని 37వ డివిజన్ ఎన్టీఆర్ పార్కులో 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా..' పేరుతో నిర్వహించిన చర్చావేదికలో సచివాలయాల పనితీరుపై ప్రజలు పలు ఫిర్యాదులు చేశారు. కొంతమంది ఉద్యోగులు అసలు సచివాలయాల్లోనే ఉండటం లేదని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కమిషనర్ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకొచ్చారు. స్థానికంగా ఉన్న పలు సమస్యలనూ ఏకరువు పెట్టారు. దీంతో కొద్దిరోజులుగా ఆ డివిజన్‌లో పనులు జరుగుతున్నాయి. మరికొన్నింటికి సంబంధించి ఎస్టిమేషన్లు వేసి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. చర్చా వేదికలో వచ్చిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ శుక్రవారం గాంధీనగర్, శివప్రసాద్ కాలనీ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాంధీనగర్‌లోని సచివాలయంలో పని చేసే సెక్రటరీల్లో ఒక్కరు కూడా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి నోటీసులు ఇవ్వాలని అక్కడే ఉన్న నోడల్ ఆఫీసర్ బాషాను ఆదేశించారు. అలాగే ఇస్లాంపేటలో ఎమినిటీ సెక్రటరీగా పనిచేస్తున్న సుభాష్‌రెడ్డి ఎలాంటి సెలవు పెట్టకుండా జనవరి 17 నుంచి విధులకు గైర్హాజరు కావడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 7 రోజుల్లో సమాధానం ఇవ్వాలని షోకాజ్ నోటీసు జారీచేశారు.

పంట కాలువకు.. ప్రైవేటు సోకులు..





అక్రమంగా జరుగుతున్న పంట కాలువ లైనింగ్ పనులు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇరిగేషన్ శాఖకు చెందిన ఆస్తుల్లో ప్రైవేటు వ్యక్తులు ఎవరూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. అలా చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారు. మార్కాపురంలోని 889 సర్వే నెంబర్‌లో పంట కాలువపై లైనింగ్ పనులు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. వెంటనే అక్కడ పరిశీలించి పంట కాలువపై ఆధునికీకరణ పనులు జరుగుతున్నట్లయితే తప్పక చర్యలు తీసుకుంటాం.

- డి.వరలక్ష్మి, ఎస్ఈ, నీటిపారుదలశాఖ, ఒంగోలు

ఇరిగేషన్ శాఖ అనుమతులు లేకుండానే ఆధునికీకరణ

- కాలువను కుదించి కొంతమేర వెంచర్‌లో కలిపేసుకున్న వైసీపీ వ్యాపారులు
- అక్కడ అన్నీ అక్రమాలే..

మార్కాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారీతిన చెలరేగిపోతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేయడం, అమాయకులను మోసం చేయడం ఇక్కడ పరిపాటైంది. గత ప్రభుత్వ హయాంలో చేసిన మోసాలను నేటికీ కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనుమతులు లేని లేఅవుట్‌లను తొలగిస్తామని రెండు మాసాల క్రితం మునిసిపల్ పట్టణ ప్రణాళిక విభాగం చాలా మందికి నోటీసులు ఇచ్చింది. అయినా రియల్ వ్యాపారులకు చీమకుట్టినట్లైనా లేదు. అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేయడమేకాక చివరికి ఇరిగేషన్ పంట కాలువలను కూడా వదలడం లేదు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు తెలియకుండా పంట కాలువను కొంతమేర వెంచర్‌లో కలిపేసుకుని పైకి మాత్రం ఆధునికీకరణ కలరింగ్ ఇస్తున్నారు. వెంచర్ సిండికేట్‌లో మొత్తం వైసీపీకి చెందిన వాళ్లే ఉన్నా ఓ టీడీపీ నాయకుడికి కూడా కొంతమేర వాటా ఉండటంతో అధికార యంత్రాంగం ఆ వైపు కన్నెత్తిచూసేందుకు కూడా ధైర్యం చేయడం లేదు. ఇదే వెంచర్‌లో రూ.15కోట్ల విలువైన స్థలాన్ని ఇప్పటికే దొంగ రిజిస్ట్రేషన్‌లతో కొట్టేశారు. ప్లాట్లను త్వరగా అమ్ముకుని బయటపడేందుకే అనుమతులు లేకుండానే పంట కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు తెలుస్తోంది.

అక్రమాలమయం ఆ వెంచర్

స్థానిక ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ఎదురుగా 889 సర్వే నెంబర్‌లో గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు కొందరు ఓ వెంచర్ వేసేందుకు సిద్ధమయ్యారు. తొలుత ఆర్అండ్‌బీ స్థలంలో దశాబ్దాలుగా తలదాచుకుంటున్న వారిని అన్నిరకాల ప్రలోభాలకు గురిచేసి తరిమేశారు. ఎదురు తిరిగిన కొందరు మైనారిటీలను బెదిరించి మరీ రోడ్డున పడేశారు. ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న 206 సర్వే నెంబర్‌లోని కాలువ పోరంబోకును కూడా పూర్తిగా ఆక్రమించేశారు. అంతేకాక ఓ వ్యక్తికి చెందిన వారసులు ఎవరూ లేకపోవడంతో సుమారు రూ.15 కోట్ల విలువ చేసే 31సెంట్ల భూమిని అక్రమ రిజిస్ట్రేషన్‌తో కలిపేసుకున్నారు. ఈ లోపు ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటివరకు చేయరాని అన్ని పనులు చేసిన రియల్ వ్యాపారుల సిండికేట్ టీడీపీకి చెందిన ఓ కీలక నాయకునికి వాటా ఇచ్చింది. దానికి ప్రతిఫలంగా తొలుత ఆ వెంచర్ వెనుకనే ఉన్న టీడీపీ నాయకుని వెంచర్‌లోకి రహదారిని నిర్మించుకునేందుకు అనుమతిచ్చారు. ఆర్అండ్‌బీ రహదారి నుంచి నేరుగా టీడీపీ నాయకుని వెంచర్‌లోకి పోయేందుకు మార్గం సుగమం కావడంతో ధరలు రెట్టింపయ్యాయి. కాలువ పోరంబోకు ఆక్రమణ, అక్రమ రిజిస్ట్రేషన్‌ల గురించి ఓ వ్యక్తి స్థానిక అధికారుల నుంచి హైకోర్టు వరకు వెళ్లి వైసీపీ రియల్ వ్యాపారులపై పోరాడుతున్నా పట్టించుకున్న నాథుడే లేకపోవడం విడ్డూరం.

ఎందుకీ ఆధునికీకరణ పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అన్ని రకాల అక్రమాలకు పాల్పడిన ఆ పార్టీ వర్గీయుల సిండికేట్.. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తీరు మార్చుకోలేదు. టీడీపీలో కీలక నాయకుడిని జత కలుపుకొని మరిన్ని అక్రమాలకు ప్రణాళిక సిద్ధం చేశారు. సదరు వెంచర్‌కు పడమర వైపున ఉన్న పంట కాలువలో కొంతమేర కొట్టేసేందుకు రంగం సిద్ధం చేశారు. అనుకున్నదే తడవుగా అనుమతులు లేకుండానే పంట కాలువ ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. అటు, ఇటు బర్మ్‌తో కలుపుకొని సుమారు 3 మీటర్లు వెడల్పు ఉండాల్సిన కాలువను 2 మీటర్లకు కుదించి లైనింగ్ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆ వెంచర్‌లో గజం విలువ రూ.50వేలతో అమ్మకాలు జరుగుతున్నాయి. కాలువ లైనింగ్ పనుల మాటున ఎంతలేదన్నా 250 గజాలకు పైగానే స్థలాన్ని వెంచర్‌లో కలుపుకోవడంతో ఇంచుమించు రూ. కోటికిపైన అక్రమ ఆదాయం సమకూరనుంది.



బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

బీజేపీ బలమైన శక్తిగా ఎదగాలి

- పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యం
- సామాన్య కార్యకర్త నుంచి ఈ స్థాయికి ఎదిగా..
- కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలమైన శక్తిగా ఎదిగేందుకు పాటుపడాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పిలుపునిచ్చారు. అందుకోసం తనవంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గెం శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారోత్సవ సభలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే వారికి ఏదో ఒక రోజు గుర్తింపు లభిస్తుందన్నారు. తాను 1991లో కార్యకర్తగా చేరానని, ఆ రోజు నుంచి నేటి వరకు పార్టీలో అనేక పదవులు వచ్చాయన్నారు. ఇప్పుడు కేంద్ర కేబినెట్‌లో సహాయ మంత్రిగా అవకాశం లభించిందన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ కూడా ఒక సామాన్య కార్యకర్త నుంచే ఆ స్థాయికి చేరుకున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీకి మంచి పట్టు ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన శ్రీనివాసరావు నేతృత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా శ్రేణులంతా పనిచేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేసిన శెగ్గం శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ముందుకెళ్తానని తెలిపారు. బీజేపీ నాయకుడు శివాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ నిడమానూరి కల్యాణ్ చక్రవర్తి, పీవీ శివారెడ్డి, శిరిసనగండ్ల శ్రీనివాసరావు, పీవీ కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, శాసనాల సరోజిని, యోగయ్యయాదవ్, విజయలక్ష్మి, బొద్దులూరి ఆంజనేయులు, తోగంటి శ్రీనివాస్‌చౌదరి, నాగేశ్వరరావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు పాల్గొన్నారు. అనంతరం మండల స్థాయి నూతన అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ విధానాలపై దిశానిర్దేశం చేశారు.

ముక్కలుగా నరికి.. ప్లాస్టిక్ సంచుల్లో మూటకట్టి..

- కంభంలో యువకుడు దారుణహత్య
- కుటుంబ సభ్యులే ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



శరీర భాగాలు ఉన్న సంచులను పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

మెయిన్‌లో..

నిధులు పక్కదారి పట్టించడంపై చర్యలు

చినకొత్తపల్లిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ నిధులు ఇతరులకు చెల్లింపు

చెక్ రూపేణ చెల్లించాల్సిన రూ.15.74 లక్షలను నేరుగా డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్

తాజా విచారణలో నిధులు కాజేసినట్లు గుర్తింపు

సర్పంచ్ చెక్ పవర్ 3 నెలల పాటు రద్దు

అప్పటి పంచాయతీ కార్యదర్శిపై వేటుకు రంగం సిద్ధం



చినకొత్తపల్లిలో ఉపాధి నిధులతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రోడ్డు

అద్దంకి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వం హయాంలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేసిన పనులకు సంబంధించిన బిల్లులను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పక్కదారి పట్టించిన ఘటనపై అధికారులు చర్యలు ప్రారంభించారు. వైసీపీ సానుభూతిపరురాలైన సర్పంచ్, వైసీపీ నేతలు చెప్పినట్లే విన్న అప్పటి పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా సొంతంగా డ్రా చేసి తమకు అనుకూలమైన వ్యక్తికి ముట్టజెప్పారు. ఆ ఉదంతానికి సంబంధించి సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయగా, అప్పటి పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు రంగం సిద్ధమైంది. వివరాల్లోకెళ్తే... అద్దంకి మండలంలోని చినకొత్తపల్లిలో టీడీపీ నాయకుడు మానం మురళీమోహన్‌దాస్ చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలోని చినకొత్తపల్లి, శ్రీనివాస నగర్‌లలో 2018-19లో 50 లక్షల రూపాయల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు నిర్మించారు. ఈ పనులకు సంబంధించి టీడీపీ నేత మానం మురళీ మోహన్‌దాస్ 30 శాతం మెటీరియల్ కాంపొనెంట్ కింద 15,74,283 రూపాయల విలువైన సామగ్రి సరఫరా చేశారు. అందుకు సంబంధించి 2021 సెప్టెంబరు 3వ తేదీ 15,74,283 రూపాయలు ప్రభుత్వం నుంచి విడుదల య్యాయి. ఈ నిధులను మురళీమోహన్ దాస్‌కు చెల్లించాల్సి ఉండగా అప్పటిపంచాయతీ కార్యదర్శి(ప్రస్తుతంసంతమాగులూరు మండలం పాతమాగులూరు పంచాయతీ కార్యదర్శి) ఈశ్వరరెడ్డి, సర్పంచ్ గుజ్జుల మల్లికలు నేరుగా డ్రా చేసి సర్పంచ్ సోదరుడు చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించారని మురళీమోహన్‌దాస్ అప్పట్లోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చీరాల డీఎల్‌పీవో శివనారాయణ గతేడాది డిసెంబరు 18వ తేదీ విచారణ చేపట్టి సర్పంచ్ గుజ్జుల మల్లికరెడ్డి, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిలు బ్యాంక్ నుంచి నేరుగా డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక అందజేశారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలకు సంజాయిషీ నోటీస్‌లు జారీ చేశారు. నోటీస్‌కు సర్పంచ్ మల్లిక ఇచ్చిన సమాధానంపై సంతృప్తి చెందని జిల్లా పంచాయతీ అధికారి 3 నెలల పాటు సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు రెండు రోజుల క్రితం ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిపై వేటుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. అదే సమయంలో పనులు చేయకుండా డబ్బులు తీసుకున్న సర్పంచ్ సోదరుడు చంద్రగిరి వీరారెడ్డిపై కూడా చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎట్టకేలకు టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ పోరాటం ఫలించి అధికారం అడ్డుపెట్టుకొని డబ్బులు డ్రా చేసిన సర్పంచ్ గుజ్జుల మల్లిక చెక్ పవర్ రద్దు కాగా, మిగిలిన ఇద్దరిపై చర్యలకు రంగం సిద్ధమైంది.



నిర్మాణంలో ఉన్న కనిగిరి రైల్వే స్టేషన్ (ఫైల్)

రైల్వేలైన్ భూ బాధితులకు పరిహారం మంజూరు

- ఫలించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కృషి

కనిగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్ భూ బాధితులకు పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేయటంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కృషి ఫలించింది. 116.44 ఎకరాలకు 12.50కోట్లు మంజూరు చేసింది. ఈనెల 4న నారా లోకేష్, సీఎస్ విజయానందన్‌ను ఎమ్మెల్యే కలిసి రైల్వేలైన్ భూ పరిహారం విడుదల కాకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో పనులు ముందుకు సాగటంలేదని తెలిపారు. నడికుడి -శ్రీకాళహస్తి రైల్వేలైన్ మార్గంలో గార్లపేట స్టేషన్ నుంచి కనిగిరి స్టేషన్ పరిధిలోని 2.7 కి.మీ వరకు ఉన్న 116.44 ఎకరాలకు సంబంధించిన రూ.12కోట్ల 38లక్షల 68వేలు శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ చేశారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రైతుల ఖాతాల్లో భూ పరిహారం జమ కావటంతో రైలు మార్గం పనులు ఊపందుకుని వేగవంతంగా పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. కనిగిరి నుంచి పామూరు వరకు రైల్వే పనులు మరింత చురుకుగా సాగుతాయని చెప్పారు. కనిగిరి ప్రాంత ప్రజల క్షేమమే తనకు ముఖ్యమన్నారు. అందుకోసం వారి సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. బాధితులకు పరిహారం త్వరతిగతిన అందించటంలో తనకు సంపూర్ణంగా సహకరించిన సీఎం చంద్రబాబుకు, నారా లోకేష్‌కు, సీఎస్ విజయానందన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తమకు పరిహారం అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు స్థానిక రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి వారికోత్సవం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

చినగంజాం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లెపాలెంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శేరు వంశస్థుల ఇలవేల్పు అయిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రథమ వారికోత్సవం సందర్భంగా అర్చకులు మాజేటి శ్రీనివాసశర్మ, మురళీ శర్మల ఆధ్వరంలో స్వామిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తదనంతరం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా దంపతులచే స్వామి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. రాత్రికి లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవాన్ని గ్రామంలోని పురవీధుల్లో మేళతాళాలతో, మంగళ వాయిద్యాలు, కళా నృత్యాలు, బాణసంచా కాంతులతో గ్రామోత్సవం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు తాత్కాలిక అంతరాయం

చీరాలటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గాంధీనగర్, ఆనందపేట, శాంతినగర్, మసీదు సెంటర్, సాయికాలనీ, రామనగర్, విజయనగర్‌కాలనీ, ఆదినారాయణపురం, బోయినవారిపాలెం, అలాగే వేటపాలెం మండల పరిధిలో కొత్తపేట, కొత్తరెడ్డిపాలెం, రామచంద్రపురం, చల్లారెడ్డిపాలెం, అక్కయ్యపాలెం, లక్ష్మీపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం ప్రాంతాలలో విద్యుత్ కట్ అవుతుందని పేర్కొన్నారు.

చీరాల బులియన్ మర్చంట్ కమిటీ అధ్యక్షుడిగా సురేష్

చీరాలటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షులుగా తులాబంధు సురేష్, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా నరసింహస్వామి, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునరావు, మురళీకృష్ణ, ఉప కార్యదర్శిగా నాగరాజురెడ్డిలను ఎన్నుకున్నారు.

తడి చెత్త, పొడి చెత్త సేకరించండి

పంగులూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. ప్రతి నెల మూడవ శనివారం గ్రామ పంచాయితీ పరిధిలో సోర్స్ రీసోర్స్ కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ నిర్వహించాలని పంచాయతీ సిబ్బందికి ఎంపీడీవో సూచించారు.

పతనమవుతున్న మిర్చి ధర..

అరకొరగా దిగుబడులు

దిక్కుతోచని మిర్చి రైతులు

పర్చూరు వ్యవసాయ డివిజన్‌లో 20 వేల ఎకరాలకుపైగా సాగు



నూతలపాడు సమీపంలో కల్లాల్లో ఎండబెట్టిన మిర్చి



కల్లాల్లోని తాలుకాయలను వేరు చేస్తున్న కూలీలు

పర్చూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మిర్చి రైతులకు కన్నీళ్లొస్తున్నాయి. రోజురోజుకూ పతనం అవుతున్న ధరను తలుచుకుని ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. ఏడాది క్రితం ధరతో పోలిస్తే ప్రస్తుతం సగం కూడా లేదు. పాత నిల్వలు ఉన్నాయన్న సాకుతో వ్యాపారులు మరీ తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈఏడాది మిర్చి సాగు ప్రారంభంలోనే తెగుళ్లు వెంటాడాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడినా ఫలితం లేకుండా పోయింది. బొబ్బర తెగులు, నల్లనల్లితో మిర్చి తోటలు గణనీయంగా దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడులు నామమాత్రంగానే ఉన్నాయి.

ఎకరాకు రూ.2 లక్షల వరకు ఖర్చు

పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు మండలాల్లో దాదాపు 20వేల ఎకరాలకు పైగా రైతులు మిర్చి పంటను సాగుచేస్తున్నారు. ఇప్పటికే కౌలు, వ్యవసాయ ఖర్చులు, ఆరుతడులు కలుపుకొని ఎకరానికి రూ.2లక్షలకు పైనే ఖర్చు పెట్టారు. ప్రస్తుతం వస్తున్న దిగుబడులు చూస్తుంటే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ధరలకు కూడా లేకపోవటంతో సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో పాలుపోవటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిల్వల పేరుతో తగ్గించి కొనుగోలు

పాత నిల్వలు ఉన్నాయన్న సాకుతో వ్యాపారులు మరీ తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. చేతికి అందివచ్చిన అరకొర దిగుబడులను అమ్ముకుందామన్నా పడిపోయిన ధరను చూస్తుంటే భయమేస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం క్వింటా ధర రూ.10వేలకు మించి లేదు. దిగుబడులు కూడా ఎకరానికి పది క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదు. గత ఏడాది ఇదే మిర్చి క్వింటాకు రెట్టింపు ధర ఉండటం గమనార్హం. ఈఏడాది మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన కూలి రేట్లు కూడా గణనీయంగా పెరిగాయి. దీంతో ఎకరానికి లక్ష రూపాయల మేర నష్టపోవాల్సి వస్తుందని రైతులు దిగాలు చెందుతున్నారు.

దేవుడి డబ్బులు డ్రా.. ఉద్యోగికి రెండేళ్ల జైలు

ఇంకొల్లు/పర్చూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : దేవుడి సొమ్మును తన సొంత అవసరాలకు వినియోగించుకొని భగవంతుడికే శఠగోపరం పెట్టిన దేవదాయశాఖ ఉద్యోగి శివప్రసాద్‌కు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించిందని ఎస్సై సురేష్ చెప్పారు. మండలంలోని ఇడుపులపాడు గ్రామంలో ఉన్న చెన్నకేశవస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన నూతలపాటి శివప్రసాద్ 2017లో ఇడుపులపాడులోని సిండికేట్‌బ్యాంకులో ఉన్న ఆలయ సొమ్ము రూ.6,54,650లను అక్రమంగా డ్రాచేయడంతో అప్పటి ఈవో దామా నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఇంకొల్లు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామి ఆలయంతోపాటు, తిమ్మరాజుపాలెంలోని గోరంట్ల వెంకన్న ట్రస్ట్‌కు సంబంధించిన నిధుల గోల్‌మాల్‌పై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి పర్చూరు కోర్టులో న్యాయాధికారి శాంతి గురువారం విచారణ చేశారు. శివప్రసాద్ నేరం చేసినట్లు సాక్ష్యాలు ఉండడంతో రెండేళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.30 వేల జరిమానా విధించారు.

విజ్ఞానయాత్రతో విద్యార్థులకు మానసికవికాసం

ఇంకొల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞానయాత్రలు మానసిక వికాసం కలిగిస్తాయని ఆదర్శస్కూల్ డైరెక్టర్ విజయభాస్కర్ చెప్పారు. ఆ పాఠశాల విద్యార్థులను స్థానికంగా ఉన్న విద్యా పాలఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. పాలసేకరణ, శీతలీకరణ గురించి అవగాహన కలిగించారు.

తల్లి పాలు బిడ్డలకు అందించేలా చర్యలు చేపట్టాలి

బల్లికురవ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డలకు తల్లి పాలు తాగించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులకు అవగాహన కల్పించాలని కొప్పెరపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి మమత చెప్పారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో రెండోరోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ పడాయిబీపై శిక్షణ ఇచ్చారు. సీడీపీవో సుధ పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై శిక్షణ



మాట్లాడుతున్న వైద్యాధికారిణి మమత

సంతమాగులూరు, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని ఏల్చూరు గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు చిన్నారుల పోషణపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో సుధా తెలిపారు. రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పిల్లల పెరుగుదల, పర్యవేక్షణ, వెయ్యి రోజుల సంరక్షణ, పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారం, తల్లి పాల లోప పోషణకు గురికాకుండా పిల్లలను సంరక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

కంటి విషయంలో జాగ్రత్త వహించాలి

పంగులూరు, ఫిబ్రవరి 14((ఆంధ్రజ్యోతి): కంటి విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ బాషా చెప్పారు. మండలంలోని బూదవాడ గ్రామంలో శుక్రవారం జరిగిన ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్యాలయం వారి సహకారంతో గొట్టిపాటి యూత్ ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో 89 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 71 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరంగా గుర్తించారు. వీరందరికీ కారంచేడు గ్రామంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్యాలయంలో ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వైద్య సహాయకులు నాగరాజు పాల్గొన్నారు.

పోషకాల ఆహారం తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సాయిశ్రీచరణ్

చినగంజాం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీ చరణ్ చెప్పారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలైన పోషణ్ బీ, పడాయ్ బీపై రెండో రోజైన ఇంకొల్లు సెక్టార్ పరిధిలోని ఇంకొల్లు, చినగంజాం మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. తీవ్ర పోషకాహార లోపం ఉన్న వారిని ఎన్‌ఆర్‌సీకి రిఫర్ చేయాలని వైద్యాధికారి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. పోషకాహార లోపం వలన కలిగే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లి పాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే రామారావు, సీడీపీవో టీ ఝాన్సీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వాణిశ్రీ, సుమలత, ఉషాకుమారి, చినగంజాం, ఇంకొల్లు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నారాయణను పరామర్శించిన మంత్రి

అద్దంకి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాల మాజీ సర్పంచ్ పాపసాని నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యచికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటుండగా విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

త్వరలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

పూర్తిగా శిథిలావస్థకు చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న శాంతినగర్-మైలవరం-వి.కొప్పెరపాడు రోడ్డుకు త్వరలో నిధులు మంజూరవుతాయని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. వెంపరాలకు వచ్చిన మంత్రి దృష్టికి గ్రామస్థులు రోడ్డు సమస్యను వివరించారు. ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, త్వరలో నిధులు విడుదల అవుతాయని తెలిపారు. టీడీపీ నేతలు కరి పరమేష్, సర్పంచ్ పౌల్, మాజీ ఎంపీటీసీ బైరపునేని రామలింగయ్య, కంచర్ల వెంకటరావు, మాదాల సురేష్, సయింపు సురేష్ తదితరులు ఉన్నారు.

చీడపీడలపై రైతులకు అవగాహన



కొమ్మాలపాడులో బొప్పాయి రైతులకు అవగాహన కలిగిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

సంతమాగులూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మాలపాడు, మామిళ్లపల్లి గ్రామాలలో మిరప, బొప్పాయి పంటలు సాగు చేసే రైతులకు శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. తామరపురుగు, కాయకుల్లు, ఆకుమచ్చ తెగ్గులు, పూత రాలిపోవడం లాంటి సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానాధికారి హనుమంతు నాయక్, హార్టికల్చర్ కన్సల్టెంట్ విష్ణుమూర్తి, రైతు సేవాకేంద్రం సిబ్బంది రవి కిరణ్ పాల్గొన్నారు.

ఆన్సర్‌బుక్‌లెట్ తీసుకెళ్లిన బీఈడీ విద్యార్థి

ఘటనపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు.. విచారణ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బీఈడీ విద్యార్థితీరుపై ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారు. సకాలంలో పరీక్షను పూర్తి చేసిన విద్యార్థి ఆన్సర్‌బుక్‌లెట్‌ను ఇన్విజిలేటర్‌కు ఇవ్వకుండా నేరుగా తాను బస చేసిన రూమ్‌కు తీసుకెళ్ళిన ఘటనపై శుక్రవారం యూనివర్శిటీ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీనిపై వైస్ చాన్సలర్ డీవీఆర్‌మూర్తి గురువారం గిద్దలూరులోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో చోటుచేసుకున్న ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ సీడీసీ డీన్ జి.సోమశేఖర్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. వీసీ ఆదేశాల మేరకు సోమశేఖర్ శుక్రవారం గిద్దలూరులో జరిగిన ఘటనపై ఎస్‌వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలిరెడ్డి, యూనివర్శిటీ పరిశీలకుడు జయభారత్‌రెడ్డి, రూము ఇన్విజిలేటర్‌తోపాటు ఈఘటనకు ప్రధాన కారణమైన ఒడిశా రాష్ట్రానికి చెందిన విద్యార్థి నుంచి కూడా లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ సీఈ డాక్టర్ కేవీఎన్ రాజు, కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌లు ఉన్నారు.

నిషేధిత జాబితాలోని భూముల పరిశీలన

ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం

పర్చూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : నిషేధిత జాబితాలో ఉన్న ఎండోమెంట్ భూములను, గ్రామ కంఠం నుంచి సబ్ డివిజన్ చేసి రైతులకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ కె.బ్రహ్మయ్య నేతృత్వంలో సిబ్బంది శుక్రవారం పర్చూరు, నూతలపాడు గ్రామంలోని దేవాలయ భూములను పరిశీలించారు. గతంలో కొంత మంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రయివేట్ భూములను కూడా దేవదాయ శాఖకు చెందినట్లు జాబితాలో పొందుపరిచారు. దీంతో ఆ భూములు రిజిస్ట్రేషన్‌లు కాక అమ్మలేక ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. దీనిపై స్పందించిన అధికారులు నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించే విధంగా క్షేత్రస్థాయిలో పరిశీలన కార్యక్రమానికి స్వీకారం చుట్టారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని దేవదాయశాఖ భూముల పరిశీలనలో అధికారులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తా

టీడీపీ చీరాల నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డాక్టరు మహేంద్రనాథ్ చెప్పారు. శుక్రవారం వేటపాలెం మండల పరిధిలోని కఠారిపాలెం గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తాగు నీరు, రహదారులు విద్యుత్ సమస్యలను మహేంద్రనాథ్ దృష్టికి తీసుకొచ్చారు. సముద్రతీరంలో వేటకు వెళ్లేందుకు ఉన్న డొంకలో రహదారి నిర్మాణం చేయాలని కోరారు. వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే దేశాయిపేట గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలనుఅడిగి తెలుసుకున్నారు. వారి నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ గో ప్రేమికుల దినోత్సవం

చీరాలటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాపరాజుతోటలోని శ్రీకృష్ణ గోశాలలో శుక్రవారం ఘనంగా ప్రపంచ గో ప్రేమికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు నెలవన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవకీ సుబ్బారావు, నీరుకట్టు నరసింహారావు, చంద్ర, శ్రీనివాసరావు, టిచంద్ర, నాగేశ్వరరావు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు ప్రారంభం

ఇంకొల్లు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.7 కోట్లతో జరిగిన పనులపై సామాజిక తనిఖీ అధికారులు పరిశీలిస్తున్నట్లు ఏపీవో రేణుకా చెప్పారు. గురువారం నుంచి గ్రామాల వారీగా ప్రారంభమై ఈ నెల 25వ తేదీ వరకు సామాజిక తనిఖీలు చేపడతారన్నారు.

పేద కుటుంబానికి చెందిన మహిళకు సాయం

మార్టూరు, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు పంచాయతీ పరిధిలోని నేతాజీనగర్‌లో అనారోగ్యంతో బాధపడుతూ పేద కుటుంబానికి చెందిన అనూరాధకు శుక్రవారం హెల్పింగ్ హాండ్స్ వారు ఆర్థిక సహాయం అందజేశారు. అంతేగాకుండా నిత్యావసరవస్తువులను కూడా అందించారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఖాదర్‌వలి, పుట్టా వెంకటేశ్వర్లు, దరువూరి సుబ్బారావు, సకల అంజనేయులు పాల్గొన్నారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

పంగులూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):మండలంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయని ఎంఈవో కె.నాగభూషణం తెలిపారు. పంగులూరు, కొండమంజులూరు, చందలూరు ఉన్నత పాఠశాలల్లో జరిగే ఈ కాంప్లెక్స్ సమావేశాలకు ఆయా కాంప్లెక్స్‌ల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులందరూ విధిగాహాజరు కావాలని ఎంఈవో కోరారు.

జీఎస్టీ పెంచే యోచన ఉపసంహరించుకోవాలి



ఆన్‌లైన్ కారణంగా వ్యాపారాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. మాల్స్ పెరగడంతో కొంత ఇబ్బందులు తలెత్తాయి. ఇదిలా ఉంటే ఇప్పటికే 5 శాతం జీఎస్టీ భారంతో అవస్థలు పడుతున్న క్రమంలో కేంద్రం ఆ సంఖ్యను 8 శాతం గాను మార్చేందుకు యోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే గతంలో దిగుబడి చేసుకున్న సరుకుకు వ్యవధి కాలం అనుకూలంగా ఉండేది. కానీ సుమారు నాలుగేళ్ల క్రితం ఎంఎస్ఎంఈ విధానం కేంద్రం అమలులోకి తెచ్చింది. ఈ విధానం వలన దిగుమతి చేసుకున్న సరుకు నగదు 45 రోజులలో చెల్లించకపోతే మేము చూపించిన ఐటీ వార్షిక ఆదాయంలో పెండింగ్‌లో ఉన్న బాకీకు కూడా కలిపి జీఎస్టీ చెల్లించాల్సి వస్తుంటడం బాధాకరం. కేంద్రం వెంటనే వ్యవధి(ఎంఎస్ఎంఈ)ని తొలగించాలి. లేదా 90 రోజులకు పెంచాలి. అలాగే జీఎస్టీని పెంచే యోచన మానుకుని వ్యాపారులను ఆదుకోవాలి.

- వేముల చంద్రశేఖర్, మార్కెట్ అధ్యక్షులు

చినబోతున్న చినబొంబాయి

- ఆన్‌లైన్ వ్యాపారాలతో స్థానిక వ్యాపారుల కుదేలు
- భారీగా తగ్గిన కొనుగోళ్లు
- జీఎస్టీ, ఎంఎస్ఎంఈ సమస్య పరిష్కరించాలని వేడుకోలు



జనసంచారం లేని చీరాల మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్



క్లాత్‌మార్కెట్‌లో వెలవెలబోతున్న దుకాణాలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు చిన బొంబాయిగా ప్రసిద్ధిగాంచిన చీరాల వస్త్ర దుకాణాలు నేడు చినబోతున్నాయి. ఒకవైపు విజృంభిస్తున్న ఆన్‌లైన్ విక్రయాలు, మరోవైపు జీఎస్టీ, ఎంఎస్ఎంఈలతో దుకాణదారులు సతమతమవుతున్నారు. 1979 ఏప్రిల్‌లో ప్రారంభమైన చీరాల మహాత్మా గాంధీమార్కెట్‌లో సుమారు 700వరకు దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ సుమారు రూ. 2000 వరకు నెలవారీ జీతాలతో కుటుంబాలు పోషించుకునే వారు ఉన్నారు. అలాగే మార్కెట్‌కు అనుసంధానంగా వాసవీక్లాత్ మార్కెట్(80షాపులు), జాలాది కాంప్లెక్సు(20షాపులు), కామధేను కాంప్లెక్సు(60 షాపులు), ఆర్ఆర్ రోడ్డులో సుమారు 200 వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఇటీవల ఏర్పడిన మాల్స్ అలాగే వీటికి అనుసంధానంగా వివిధ రకాల అల్పాహారం, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్ వంటివి చాలానే ఉన్నాయి. మొత్తంగా ఈ పరిసరాల్లో సుమారు 10 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ దాదాపుగా వందల కోట్ల వ్యాపార వాణిజ్య సముదాయాలు ఉన్నాయి..

ఇతర రాష్ట్రాల నుంచి సరుకు దిగుబడి

చీరాల వస్త్ర దుకాణాల్లో విక్రయాలు జరుపుతున్న సరుకు నిత్యం మధ్యవర్తులు లేకుండా సూరత్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, బెనారస్, బొంబాయి ప్రాంతాల నుంచి దుకాణదారులకు చేరుతుంది. ఈక్రమంలో దాదాపుగా నాణ్యమైన సరుకునే కస్టమర్‌లకు విక్రయించడంతో పాటు బట్ట నాణ్యంగా ఉంటుండటంతో మార్కెట్‌కు గొప్ప పేరు వచ్చింది. దీంతో చీరాలకు విశాఖపట్నం, చిత్తూరు, శ్రీకాకుళం, తిరుపతి వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో వచ్చి కొనుగోళ్లు చేసేవారు.

వ్యాపార రంగానికి గడ్డుకాలం

ఈక్రమంలో విరాజిల్లుతున్న వ్యాపార సముదాయాలుకు గడ్డుకాలం వచ్చింది. డిజిటల్ వ్యవస్థ హోరెత్తుతున్న క్రమంలో ఎక్కువ మంది నేడు అన్ని వెంటనే కావాలని, తన దగ్గరకే రావాలని కోరుకుంటున్నారు. దీంతో ఆన్‌లైన్‌కు దగ్గరయ్యారు. ఇష్టమొచ్చిన మోడల్స్‌ను, అవసరమైన వస్తువులను ఇంట్లో కూర్చొనే బుక్ చేసుకుంటున్నారు. పైగా మార్కెట్ బయట ప్రయివేట్ వ్యక్తులు కమీషన్‌కు ఆశపడి వ్యాపారాలను దారి మళ్లిస్తున్నారు. మరోవైపు జీఎస్టీ, ఎంఎస్ఎంలు భారంగా మారాయి. దీంతో వ్యాపారాలకు గడ్డు పరిస్థితి ఏర్పడింది.

నల్లమలలో ప్రయాణం నరకం

- జాతీయ హోదా వచ్చినా కనిపించని అభివృద్ధి
- యాత్రికులకు తప్పని ఇక్కట్లు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. కర్నూలు-గుంటూరు రహదారికి జాతీయ హోదా కల్పించినా విస్తరణకు నోచుకోలేదు. దీంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడంలేదు. రాయలసీమ నుంచి అమరావతికి, ప్రఖ్యాత పుణ్యక్షేత్రం దక్షిణకాశీగా వెలుగొందే శ్రీశైలానికి వెళ్లాలంటే ఈ రహదారి మీదుగా వెళ్లాల్సి ఉంది. అయితే సింగిల్ రోడ్డు కావడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో అభయారణ్యంలో కిలోమీటర్ల మేర వాహనాలు రెండు వైపులా నిలిచిపోవాల్సి వస్తోంది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. కనీసం ఈ సమాచారం బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు కూడా అవకాశం ఉండక పోతుండడంతో గంటల తరబడి బిక్కుబిక్కుమంటూ యాత్రికులు అడవిలో భయాందోళనలు చెందుతు న్నారు. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకోవడం పరిపాటిగా మారింది.

జాతీయ హోదా వచ్చినా తీరని బాధలు

కర్నూలు-గుంటూరు రహదారిని ఎన్‌హెచ్340సీ నంబరుతో కేంద్రప్రభుత్వం 2018 జనవరి 18న మార్చింది. అయినా రోడ్డు విస్తరణకు అటవీశాఖ అనుమతి ఇవ్వలేదు. దాంతో నేటికీ సింగిల్ రోడ్డే దిక్కయింది. ఆ రోడ్డు కూడా గుంతలు ఉండడం, వరదనీటికి కోతలు పడడంతో అస్తవ్యస్తంగా తయారైంది. ముఖ్యంగా రోడ్డుకు రెండు వైపులా అంచులు మరీ దారుణంగా ఉన్నాయి. అడుగున్నర లోతు గుంతలు పడడంతో వాహనాలు రోడ్డు దిగా లంటేనే వాహన చోదకులు బెంబేలెత్తి పోతున్నారు. వాహనాలు ఒక దానికొకటి ఎదురుపడితే గొడవ పడ కుండా దాటిన దాఖలాలు లేవనే చెప్పాలి. అమరావతి రాజధాని కావడంతో వాహనాల రాకపోకలు మరింత పెరిగాయి. జాతీయ హోదా కల్పించడంతో కర్నూలు జిల్లా పరిధిలో రోడ్డువిస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కానీ ప్రకాశం జిల్లా పరిధిలో మాత్రం అటవీ శాఖ అభ్యంతరాలతో కనీసం రోడ్డు అంచులపై తారు రోడ్డు నిర్మాణానికి అనుమతులు లభించలేదు. దీంతో నల్లమల ఘాట్ రోడ్డులో ప్రయాణం కష్టతరంగా మారింది. ప్రధానంగా పెద్ద మంతనాల నుండి రోళ్లపెంట వరకు 30 కిలోమీటర్ల ప్రయాణం భయంకరంగా సాగుతోంది. రోడ్డు వంపులు తిరిగి ఎగుడు దిగుడుగా ఉంటుంది. దీనికి తోడు ఒక వైపు ఆకాశానంటే ఎత్తైన కొండలు, మరోవైపు లోతైన లోయలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో భారీ వాహనాలు లోడుతో ప్రయాణించేటప్పుడు ఘాట్ ఎక్కలేక మొరాయిస్తుంటాయి. వాటిని కంట్రోల్ చేయ లేక డ్రైవర్లు నానా అవస్థలు పడతారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి అటవీ శాఖ అనుమతులు పొంది విస్తరణ పనులు నిర్వహించాల్సి ఉంది. ఈనెల 26న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల19వ తేదీ నుండి మార్చి 1వ తేదీ వరకు శ్రీశైలంలో బ్రహ్మో త్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు మరమ్మత్తుల నిర్వహణకు కోటిన్నరకు పైగా నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో రోడ్డుపై గుంతలు పూడ్చడానికి గట్టి మొరుము వంటి మట్టిని పోయాల్సి ఉంది. అయితే సమీప ప్రాంతంలో లభించే దువ్వ మట్టిని పోస్తున్నారు. కనీసం నీళ్లు కూడా చల్లక పోవడంతో వాహనాలు రోడ్డు దిగితే పాత గోతులు మళ్లీ బయటపడుతున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు రహదారి అంచుల వెంబడి రహదారులకు సోర్టింగ్ గోడలను కూడా పటిష్ట పరిచాల్సి ఉంది. అటవీ ప్రాంతంలో ప్రమాదాలు జరిగితే వెంటనే సహాయక చర్యలు చేపట్టేందుకు రక్షణశాఖాధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాల్సి ఉంది.



ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాల రాకపోకలు (ఫైల్)



చప్టాపై లేని రక్షణ గోడ

అక్రమం కాదు.. సక్రమమే

వంశీ అరెస్టుపై మంత్రి డోలా వ్యాఖ్య



కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకమని, చట్టం తన పని తాను చేసుకుపోతోందని, పోలీసుల విచారణలో తప్పుచేసినట్లు తేలితేనే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. గురువారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడా అ క్రమ అరెస్టులకు పాల్పడలేదన్నారు. వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం విలువలకు కట్టుబడి పనిచేస్తుందని, టీడీపీ నాయకుల పట్ల గత ప్రభుత్వం వ్యవహరించినట్లు నేడు కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తే సగం మంది వైసీపీ నాయకులు జైళ్ల, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండేవారని ఆ యన వ్యాఖ్యానించారు. హామీ ఇచ్చిన మేరకు సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది వరకు అమ్మఒడి పథకాన్ని అ మలు చేయలేదని ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాకముందే పథకాలపై దుష్ప్రచారం చేయటం వైసీపీ నాయకులకు తగదని ఆయన అన్నారు.

తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు

- సబ్ కలెక్టర్ ఆదేశాలతో తాత్కాలిక బదిలీలు
- తహసీల్దార్‌పై కొనసాగుతున్న విచారణ

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెంలోని సర్వే నెంబరు 58-1లో ఆర్అండ్ బీ రోడ్డుకు అక్రమ పత్రాలు ఇచ్చిన అధికారులపై బదిలీ వేటు పడింది. ఆ పత్రాలతో రిజిస్ట్రేషన్ నిర్వహించడంపై ఈ నెల 2న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన చిక్కడు దొరకడు శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించారు. మార్కపురం సబ్ కలెక్టర్‌ను విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నెల 3వ తేదిన సబ్ కలెక్టర్ వెంకట్ త్రీవినాగ్ విచారించారు. ఈ విచారణలో పలు ఆరోపణలు రుజువయ్యాయి. దీంతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి సంతకాలు చేసిన ఎర్రగొండపాలెం వీఆర్‌వో-2 ముటుకూరి ఏల్లయ్య, సర్వేయర్లు దిలీప్, వెంకటేశ్వరరెడ్డిపై చర్యలకు సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ తహసీల్దారు నలగాటి మల్లికార్జున నాయుడు వీఆర్‌వో-2 ఎల్లయ్యను నల్లమల అటవీ ప్రాంతంలోని పాలుట్లకు బదిలీ చేశారు. అలాగే సర్వేయర్ దిలీప్‌ను కాశికుంట తండాకు, వెంకటేశ్వరరెడ్డిని అమానిగుడిపాడుకు బదిలి చేసినట్లు ఆయన తెలిపారు. ఇంకా విచారణ కొనసాగుతుండగా, అప్పటి తహసీల్దారు ఏ బాలకిషోర్ సెలవులో ఉన్న విషయం తెలిసిందే.

వంట కార్మికురాలిపై ఉపాధ్యాయుడి దాడి

- చెప్పుతో కొట్టిన వైనం
- స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసిన గ్రామస్థులు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు





ఉపాధ్యాయుడిని స్తంభానికి కట్టేసిన గ్రామస్థులు (ఇన్‌సెట్లో) గాయపడిన వంట కార్మికురాలు

కురిచేడు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వంట మనిషిపై ఉపాధ్యాయుడు దాడి చేశాడు. ఈఘటన కురిచేడు మండలం పడమర నాయుడుపాలెం పంచాయతీ వల్లెల యానాది(వీవై) కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వేముల వెంకటరవికుమార్ అక్కడ వంట చేసే కార్మికురాలిని దుర్భాషలాడుతూ చెప్పుతో కొట్టాడు. దీంతో గ్రామస్థులు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసి విద్యుత్ స్తంభానికి కట్టేశారు. బాధిత మహిళ కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

కురిచేడు మండలం పడమరనాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని వీవై కాలనీ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 వరతగతుల వరకు 68 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అక్కడ చలంచర్ల లక్ష్మమ్మ అనే మహిళ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతుంది. రెండు రోజుల క్రితం విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఒక విద్యార్థి కాళ్లకు బూట్లతో అక్కడికి వస్తుంటే లక్ష్మమ్మ వారించింది. దీనిపై ఉపాధ్యాయుడు రవికుమార్ నీకేం సంబంధం, నీవెవరు ఆపడానికి అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడాడు. ఈవిషయమై లక్ష్మమ్మ ప్రధానోపాధ్యాయుడికి, పడమరనాయుడుపాలెం సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. వారు ఉపాధ్యాయుడికి, లక్ష్మమ్మకు సర్దిచెప్పారు. తిరిగి శుక్రవారం ఉదయం లక్ష్మమ్మ మధ్యాహ్న భోజనం తయారు చేయడానికి బియ్యం తీసుకుంటుండగా సదరు ఉపాధ్యాయుడు ఆమె వద్దకు వచ్చి దుర్భాషలాడాడు. ఆమె ఆగ్రహం వ్యక్తం చేయగా చెప్పుతో తలపై కొట్టాడు. ఆమె కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పాలని వెళుతుండగా రోడ్డుపై కూడా ఆమెపై దాడి చేశాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు పాఠశాల వద్దకు రాగా వారిని సైతం రవికుమార్ దుర్భాషలాడాడు. దీంతో సదరు ఉపాధ్యాయుడిని పాఠశాల నుంచి బయటకు తీసుకువచ్చి దేహశుద్ధి చేసి, పాఠశాల పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టేశారు. ఈవిషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో వారు వెళ్ళి ఉపాధ్యాయుడిని కురిచేడుకు తీసుకువచ్చి స్థానిక ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేయించారు. తనపై దాడి చేసిన విషయాన్ని కురిచేడు పోలీస్ స్టేషన్‌లో లక్ష్మమ్మ ఫిర్యాదు చేసింది. ప్రధానోపాధ్యాయుడు డి.సూర్యనారాయణ మండల విద్యాశాఖాధికారులకు రిపోర్టు చేశారు.

ఆది నుంచి వివాదాలే..

వీవై కాలనీలో పనిచేసే ఉపాధ్యాయుడు రవికుమార్ ఆది నుంచి వివాదాలతోనే పనిచేస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం పాఠశాల సందర్శనకు వెళ్ళిన మండల ప్రత్యేకాధికారిణితో అనుచితంగా ప్రవర్తించాడు. ఆమె జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసింది. ఈవిషయమై ఒంగోలు ఉప విద్యాశాఖాధికారి విచారణకు రాగా క్షమాపణ చెప్తూ రాతపూర్వకంగా వ్రాసి ఇవ్వమనగా అతను అంగీకరించలేదు. దీంతో రవికుమార్‌ను సస్పెండ్ చేశారు. తొమ్మిది నెలల తర్వాత ఆయన విధుల్లో చేరాడు. ఇటీవల మండలంలోని ఓ ఉన్నతాధికారిణి పాఠశాలలో ఓ సమావేశానికి హాజరయ్యారు. పాఠశాలను సందర్శిస్తూ విద్యార్థులు ఎలా చదువుతున్నారు అని అడగ్గానే మీ కెందుకు, మీ పని చూసుకోండి అని దురుసుగా సమాధానం ఇచ్చాడు. ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంఈవోకు విషయం తెలియజేశారు. ఎటువంటి చర్యలు తీసుకోవద్దని జాగ్రత్తగా ఉండమని చెప్పాలంటూ తెలియజేశారు. సహ ఉపాధ్యాయులతో సైతం నిత్యం గొడవలు పడుతుంటారు. దీంతో తామే సర్దుకుపోతున్నట్లు వారంటున్నారు.

నేడు క్లస్టర్ సమావేశాలు : డీఈవో

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 150 క్లస్టర్లలో ఈనెల సమావేశాలు శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించాలని డీఈవో కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్ నిర్వహణకు అవసరమైన ఐఎఫ్‌పీ, ప్యానల్స్, ఇంటర్‌నెట్ సదుపాయాలపై సమావేశాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్లస్టర్ పరిధిలో మ్యాపింగ్ చేసిన అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఎవరికీ మినహాయింపు లేదని డీఈవో స్పష్టం చేశారు.

నేడు పాఠశాలల్లో 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'

జిల్లాలోని అన్ని యాజమాన్యాలలోని పాఠశాలల్లో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని డీఈవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

20న విద్యుత్ మీటర్స్ రీడర్ల మహాసభ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 20వతేదీన విద్యుత్ మీటర్స్ రీడర్ల రాష్ట్ర ప్రథమ మహాసభ జరుగుతుందని ఏఐటీయూసీ నగర నాయకుడు శ్రీరామ్ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శుక్రవారం ఈ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ విద్యుత్ శాఖలో గత 15 ఏళ్ళ నుంచి పనిచేస్తున్న మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మీటర్ రీడర్స్ యూనియన్ కార్యదర్శి సిద్ధయ్య మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చిన తరుణంలో మీటర్స్ రీడర్ల ఉపాధి దెబ్బతినే పరిస్థితి నెలకొందన్నారు. జిల్లాలోని విద్యుత్ మీటర్స్ రీడర్స్ అందరూ పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాల్యాద్రి, పి.పిచ్చయ్య, దత్తు, మధు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆశయం వృద్ధాశ్రమంలో గురువారం జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫాతుల్లా బాషా ఆధ్వర్యంలో వృద్ధులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమానికి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వహకురాలు లీలారాణి, మజ్దూర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి సిద్దాంబీ పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ


విజయసంకేతం చూపుతున్న విద్యార్థులు, నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు మంచి ప్రతిభను చాటినట్లు ఆ విద్యాసంస్థల కోర్ డీన్ ఆర్.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మంగమూరురోడ్డులోని నారాయణ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ తమ విద్యా సంస్థలకు చెందిన డి.గౌతమ్ 97.61, సి.మోనీష్ 93.68, సీహెచ్.వేణుగోపాల్ 92.78, వి.సాకేత్ 91.54, నాగశ్రీసంజన 91.39 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలలో గరిష్ఠంగా 95కు పైగా పర్సంటైల్‌ను 40 మంది విద్యార్థులు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం మురళి, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

సింగరాయకొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధి పకీర్‌పాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వర్ణ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చదువు ద్వారానే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకరరెడ్డి, అగ్గిబోయిన రాంబాబు, సంస్థ అధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, సభ్యులు కోటపాటి నారాయణ, మహంకాళి నరసింహారావు, కెవీ రత్నం పాల్గొన్నారు.

అనాథలకు దోమతెరల పంపిణీ

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విశ్వమానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అనాథలకు దోమతెరల పంపిణీ జరిగింది. స్థానిక దశరాజుపల్లిరోడ్డులో ఉన్న ఆశయం వృద్ధాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు జి.గురవారెడ్డి, వ్యవస్థాపకులు పెసల మస్తాన్‌రావు ఆధ్వర్యంలో 25 మంది అనాథ వృద్ధులకు దోమతెరలను అందజేశారు. దోమలతో వృద్ధాలయంలో ఇబ్బందిపడుతున్న సంగతి నిర్వాహకురాలు లీలారాణి తమ దృష్టికి తీసుకురావడంతో వాటిని అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్.రాధాకృష్ణ మూర్తి, విశ్రాంత అధికారి ఎస్.అప్పలరాజు, బీవీ.రమణారెడ్డి, టి.దయామణి, నిర్వాహకురాలు లీలారాణి పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా బ్యాంకర్స్ యూనియన్ అధ్యక్షుడు కె.రాజీవ్‌రతన్‌దేవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలు నగరం నెల్లూరు బస్టాండ్ వద్ద యూనియన్ బ్యాంక్ ఎదుట యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌రతన్‌దేవ్ మాట్లాడుతూ గతంలో కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

గృహహింస చట్టం కింద కేసు

కొత్తపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భర్త, అత్తమామలు తనను వేధిస్తున్నారని, హింసకు గురిచేస్తున్నారంటూ అల్లూరు గ్రామానికి చెందిన షేక్ పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపట్నం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. భర్త బాజీ, అతని తల్లిదండ్రులపై గృహ హింస చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటితో సబ్సిడీ రుణాల దరఖాస్తుకు ఆఖరు

మద్దిపాడు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాల తుది గడువు శనివారంతో ముగుస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈడబ్ల్యూసీ, బీసీ వర్గాలకు సబ్సిడీ రుణాల కోసం శనివారం సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

గేదెను ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి

పొన్నలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గేదెను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన పొన్నలూరు సమీపంలోని కోల్డ్ స్టోరేజీ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై అనూక్ కథనం మేరకు.. పొన్నలూరుకు చెందిన పందిళ్ల మధుబాబు (27) ఆటోలో ఇళ్లకు తాగునీటిని సరఫరా చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి వ్యక్తిగత పనుల కోసం కందుకూరుకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. కొద్దిదూరం రాగానే గేదెలు అడ్డువచ్చాయి. చీకట్లో గమనించని మధుబాబు వాటిని ఢీకొట్టాడు. దీంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మధుబాబుకు రెండేళ్ల క్రితమే వివాహమైంది. ఆయనకు ఒక చిన్న పాప కూడా ఉన్నట్లు సమాచారం.

సంజీవయ్య జీవితం యువతకు ఆదర్శం

మంత్రి డాక్టర్ స్వామి

జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించిన కలెక్టర్, జేసీ తదితరులు


సంజీవయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, మేయర్ సుజాత

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ గంగాడ సుజాత, జేసీ గోపాల్‌కృష్ణ, మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంజీవయ్య పేదరికంలో జన్మించినా ఉన్నత చదువులు, ఉన్నత వ్యక్తిత్వంతో ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు వంటి ఎన్నో ఉన్నత పదవులు అలంకరించారని కొనియాడారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ విలువలు, అంకితభావానికి నిదర్శనం సంజీవయ్య జీవితం అన్నారు. నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీడీ ఎం.లక్ష్మానాయక్, ఈడీ అర్జున్‌నాయక్, పీడీ హేనాసుజన్, ఈడీ ధనలక్ష్మి, ఏడీ అర్చన, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, రెసిడెన్షియల్ స్కూల్స్ జిల్లా కో ఆర్డినేటర్ జయలక్ష్మి, దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రరరావు, బిళ్లా చెన్నయ్య, దారా అంజయ్య, యాదాల బుజ్జి, కాకుమాని రవి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎస్పీ


నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్, పోలీసు అధికారులు

ఒంగోలు క్రైం: దేశంలోనే ఏసీబీ వ్యవస్థను ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పాటు చేసిన రూపకర్త మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య అని ఎస్పీ దామోదర్ కొనియాడారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఎస్పీ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఈఎస్ డి.బాలయ్య, ఏవో రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

సీవీఎన్ రీడింగ్ రూంలో..

ఒంగోలు కల్చరల్: మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనమాల రాఘవ, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబు, విశ్రాంత అధికారి మెడబలిమి సాంబశివరావు, సంతవేలూరి కోటేశ్వరరావు, కొప్పోలు వెంకటేశ్వర్లు, గుంటూరు సత్యనారాయణ, పెద్దిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణమ్మ, టి.కృష్ణవేణి, శివకుమారి, వై.మృదుల్‌కుమార్ పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గంగిశెట్టి నరసింహారావు, ప్రముఖ కళాకారుడు కాకుమాను వెంకటసుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీహర్షిణి విద్యార్థుల ప్రభంజనం


ఈశ్వరి, హాఫ్స, ఆదిలక్ష్మి, స్వప్నిక, జయవర్ధిని

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పరిధిలో జరిగిన ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో స్థానిక శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. బీఎస్సీ(బీజడ్‌సీ) విభాగంలో ఎస్‌కే.అశాభాను 900లకు 863 మార్కులతో ప్రథమ స్థానంలో నిలువగా, అనూష 854, వి.ఆశ్రియ 843 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. బీఎస్సీ(బీఎంసీ)విభాగంలో కె.చంద్రిక 900లకు 856 మార్కులతో ప్రథమ స్థానంలో నిలువగా, ఎం.ప్రణవి 848, ఇ.దేవికాసౌమ్య 840 మార్కులు సాధించారు. బీఎస్సీ(అగ్రికల్చరల్) విభాగంలో కె.సింధుజ 900లకు 825 మార్కులతో ప్రథమ స్థానంలో నిలువగా, పి.వెంకటలక్ష్మి 921, బి.సాయిప్రసన్న 808 మార్కులు, ఇక బీసీఏ విభాగంలో జె.ఆదిలక్ష్మి 900లకు 840 మార్కులతో ప్రథమ, బి.సాయిప్రసన్న 825 ద్వితీయ, వి.వెంకటస్వాతి 817 తృతీయ స్థానం సాధించారు. బీసీవోఎం విభాగంలో వై.స్వప్నిక 700లకు 636 మార్కులతో ప్రథమ స్థానం, ఎం.కౌసల్య 632, బి.యశోదలక్ష్మి 618 మార్కులు సాధించారు. బీఎస్సీ(టీఎండబ్ల్యూ) విభాగంలో జి.పూజిత 900లకు 829 మార్కులతో మొదటి స్థానాన్ని, జి.లక్ష్మి 828 మార్కులతో తర్వాత స్థానంలో నిలిచారు. బీఎస్సీ(ఎంపీసీఎస్) విభాగంలో టి. విజయలక్ష్మి 800లకు 753 మార్కులతో ప్రథమ స్థానం, పి.వైష్ణవి 749, ఎస్‌కే.అమీనా 746 మార్కులు, బీఎస్సీ (ఎంఎస్‌సీఎస్) విభాగంలో టి.జయవర్షిని 800లకు 769, ఎ.వినీత 765, జి.లావణ్య 762 మార్కులు పొందారు. ఇక బీఎస్సీ (ఎంసీసీఎస్) విభాగంలో జి.లోకేశ్వరి 800లకు 720 మార్కులు, బీఎస్సీ(ఆక్వాకల్చర్)లో డి.సునీల 900లకు 791, జి.త్రివేణి 789 మార్కులు, బీబీఏ విభాగంలో ఎస్‌కే.హఫ్స 600లకు 519, నందిని 519, పి.సంతోష్ 505 మార్కులు సాధించారు. బీఏ విభాగంలో ఈశ్వరి 600లకు 487, కేఏ.పాల్ 486, ఎస్‌కే.దినేష్‌యామిన్ 482 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దాది అంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి, ఏవో శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

విచారణకు హాజరైన సర్పంచ్

మద్దిపాడు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు పంచాయతీ పరిధిలోని గ్రామకంఠంలోని చిల్లచెట్లను అక్రమంగా నరికి తరలిస్తున్నారన్న వివాదంలో సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు శుక్రవారం విచారణ అధికారుల ముందు హాజరయ్యారు. ఈ విషయంపై గ్రామస్థులు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, కలెక్టర్ ఆదేశాలతో మండల విస్తరణ అధికారి రఘుబాబు, పంచాయతీ కార్యదర్శి షేక్ నూరుల్లా, సర్పంచ్ వెంకటేశ్వర్లును 14వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అయితే పంచాయతీ కార్యదర్శి నూరుల్లా ప్రమాదంలో గాయపడిన కారణంగా విచారణకు హాజరు కాలేదు. స్థానిక సచివాలయంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు వివరణ ఇస్తూ గత ఏడాది నవంబరు నెలలో జరిగిన పంచాయతీ సాధారణ సమావేశంలో జంగిల్ క్లియరెన్స్ చేయటానికి పాలకమండలి ఆమోదం తెలిపిందని, అయితే అవగాహనా లోపంతో గ్రామ కంఠ భూమిలో జంగిల్ క్లియరెన్స్ చేయటానికి ప్రతిపాదించినట్లు చెప్పారు. తొలగిస్తున్న చిల్లచెట్లను తాము స్వాధీనం చేసుకున్నామని, ఉన్నతాధికారుల అనుమతితో బహిరంగ వేలం ద్వారా వాటిని విక్రయించి నగదు పంచాయతీకి జమచేస్తామని తెలిపారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): శ్రీగోవిందమాంబా సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణోత్సవం శుక్రవారం స్థానిక కర్నూల్‌రోడ్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు ఇంకొల్లు మధుసూధనాచార్య యాజ్ఞికం కల్యాణ క్రతువును జరిపించారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు పేలప్రోలు రామకృష్ణ పరమహంస బిర్లా, పేలప్రోలు బ్రహ్మానందం దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో నల్లపాటి కుమార స్వామి, ఏల్చూరి ప్రదీప్‌శాస్త్రి, పాలెపు వెంకటేశ్వరశర్మ, నూతలపాటి హరిబాబు, భక్తులు పాల్గొన్నారు.

21న మాతృభాషా దినోత్సవం

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కళామిత్ర మండలి ఆధ్వర్యంలో ఈ నెల 21న మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రాలను ఆయన శుక్రవారం ఒంగోలులో జనసేన పార్టీ నాయకుడు కంది రవిశంకర్‌కు, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డీవీఆర్.మూర్తిలకు అందజేశారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సాయంత్రం 4 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో గద్వాల సోమన్న రచించిన పిల్ల తెమ్మెరలు బాలగేయాల గ్రంథావిష్కరణ ఉంటుందన్నారు. అదేవిధంగా జిల్లాలోని కవులు, కళాకారులు, సామాజిక సేవారంగ ప్రముఖులు 32 మందికి తెలుగు భాషా విశిష్ట సేవాపురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇక విద్యార్థులకు వ్యాస రచన, వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని, చిన్నారుల నృత్యప్రదర్శన సైతం ఏర్పాటుచేసినట్లు అంకమ్మరావు తెలిపారు.

బక్కిరెడ్డిపాలెంలో ఎస్టీలపై దాడి

చీమకుర్తి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి) : బక్కిరెడ్డిపాలెం గ్రామంలో ఎస్టీ మహిళలపై శుక్రవారం రాత్రి మరో వర్గానికి చెందిన మహిళలు దాడి చేసినట్లు ఎరుకల హక్కులపోరాటసమితి నాయకులు పేరం శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడిలో గాయపడిన కొమరగిరి వెంకటేశ్వరితో పాటు మరో మహిళ చీమకుర్తి సీహెచ్‌సీలో వైద్య సేవలనిమిత్తం చేరారు. తొలుత వీరు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా వారి సూచన మేరకు ఆసుపత్రికి వచ్చారు. గేదె దూడ గురించి ఇరువురి మధ్య జరిగిన వాగ్వాదం దాడుల వరకు వెళ్లినట్లు సమాచారం. కాగా ఎస్టీలు జరిపిన దాడిలో గాయపడ్డామంటూ మరో వర్గానికి చెందిన మహిళలు చీమకుర్తి సీహెచ్‌సీలో చేరారు. ఈ సంఘటనపై ఎస్ఐ కృష్ణయ్య స్పందిస్తూ ఆసుపత్రి నుంచి అందిన రిపోర్టుల మేరకు విచారణ జరుపుతామన్నారు. ఇప్పటివరకూ ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళులు


విజయస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్స్ సభ్యులు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పుల్వామాలో తీవ్ర వాదుల ఆత్మాహుతి దాడిలో మరణించిన 40 మంది జవానులకు శుక్రవారం పలు సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అంజయ్యరోడ్‌లోని ఏకేవీకేలో జేసీఐ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు ఎంవీ.సుబ్బారావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న 40 మంది దేశ సైనికులను ఉగ్రవాదులు హతమార్చారని, వారి త్యాగాలు అనిర్వచనీయని చెప్పారు. అనంతరం మాజీ సైనికుడు కసిబిసి నాగబ్రహ్మంను సత్కరించారు. కార్యక్రమంలో జేసీఐ చైర్మన్ వి.శ్రీరాములురెడ్డి, కె.శివకోటిరెడ్డి, మాల్యాద్రి, శ్రీకాంత్, బాలసుబ్రహ్మణ్యం, వరుణ్‌కుమార్, డాక్టర్ రవికుమార్, శ్రీనివాసరావు, బాషా, శివారెడ్డి పాల్గొన్నారు.

- వాసవీ క్లబ్, వాసవీ ఒంగోలు సిటిజెన్స్ ఆధ్వర్యంలో స్థానిక బండ్లమిట్టలోని కార్గిల్ స్థూపం దగ్గర పుల్వామా అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షులు భూమా శ్రీనివాసులు, కొప్పురావూరి భరతసింహ, మద్దాలి శివప్రసాద్, పబ్బిశెట్టి గోవర్ధన్, సీహెచ్.సత్యనారాయణ, దర్శి మనోహర్, చంద్రశేఖర్, నేరెళ్ల శ్రీనివాసరావు, రాధా రమణగుప్తాజంధ్యం, స్వర్ణ సాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

అది ఉంటేనే సంక్షేమ పథకాలు, ఇతర సేవలు ● డీఏవో శ్రీనివాసరావు

మర్లపాడు (టంగుటూరు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. అది ఉంటేనే సంక్షేమ పథకాలు, ఇతర సేవలు అందుతాయని స్పష్టం చేశారు. మండలంలోని మర్లపాడులో శుక్రవారం విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం జరిగింది. దీన్ని డీఏవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పొలం ఉన్న ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్యతో కూడిన కార్డు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మండలంలో 5,300 మంది రైతులు పీఎం కిసాన్ లబ్ధిదారులుగా ఉన్నారని, వారంతా ఈనెల 25వ తేదీ లోపు వ్యవసాయ సిబ్బందిని కలిసి గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, విత్తనాలు, యంత్రపరికరాలతోపాటు వ్యవసాయ శాఖ ద్వారా ఏరకమైన లబ్ధి పొందాలన్నా గుర్తింపు సంఖ్య విధిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆశీర్వాదం, ఏవో జి.స్వర్ణలత, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎ. శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

సమాజసేవలోనే సంతృప్తి

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మనకు ఉన్నంతలో సమాజానికి సేవ చేయటంలోనే సంతృప్తి ఉందని నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అన్నవరప్పాడులోని శివం శరణాలయంలో ప్రముఖ న్యాయవాది పోకల వెంకటరామారావు ఆధ్వర్యంలో అనాథలకు అన్నదానం నిర్వహించారు. వెంకటరామారావు బంధువు అడపా శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి రామయ్యచౌదరి, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ పెంచే యోచన ఉపసంహరించుకోవాలి



ఆన్‌లైన్ కారణంగా వ్యాపారాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. మాల్స్ పెరగడంతో కొంత ఇబ్బందులు తలెత్తాయి. ఇదిలా ఉంటే ఇప్పటికే 5 శాతం జీఎస్టీ భారంతో అవస్థలు పడుతున్న క్రమంలో కేంద్రం ఆ సంఖ్యను 8 శాతం గాను మార్చేందుకు యోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే గతంలో దిగుబడి చేసుకున్న సరుకుకు వ్యవధి కాలం అనుకూలంగా ఉండేది. కానీ సుమారు నాలుగేళ్ల క్రితం ఎంఎస్ఎంఈ విధానం కేంద్రం అమలులోకి తెచ్చింది. ఈ విధానం వలన దిగుమతి చేసుకున్న సరుకు నగదు 45 రోజులలో చెల్లించకపోతే మేము చూపించిన ఐటీ వార్షిక ఆదాయంలో పెండింగ్‌లో ఉన్న బాకీకు కూడా కలిపి జీఎస్టీ చెల్లించాల్సి వస్తుంటడం బాధాకరం. కేంద్రం వెంటనే వ్యవధి(ఎంఎస్ఎంఈ)ని తొలగించాలి. లేదా 90 రోజులకు పెంచాలి. అలాగే జీఎస్టీని పెంచే యోచన మానుకుని వ్యాపారులను ఆదుకోవాలి.

- వేముల చంద్రశేఖర్, మార్కెట్ అధ్యక్షులు

చినబోతున్న చినబొంబాయి

- ఆన్‌లైన్ వ్యాపారాలతో వస్త్ర వ్యాపారం కుదేలు
- భారీగా తగ్గిన కొనుగోళ్లు
- జీఎస్టీ, ఎంఎస్ఎంఈ సమస్య పరిష్కరించాలని వేడుకోలు



జనసంచారం లేని చీరాల మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్

చీరాలటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు చిన బొంబాయిగా ప్రసిద్ధిగాంచిన చీరాల వస్త్ర దుకాణాలు నేడు చినబోతున్నాయి. ఒకవైపు విజృంభిస్తున్న ఆన్‌లైన్ విక్రయాలు, మరోవైపు జీఎస్టీ, ఎంఎస్ఎంఈలతో దుకాణదారులు సతమతమవుతున్నారు. 1979 ఏప్రిల్‌లో ప్రారంభమైన చీరాల మహాత్మా గాంధీ మార్కెట్‌లో సుమారు 700వరకు దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ



క్లాత్‌మార్కెట్‌లో వెలవెలబోతున్న దుకాణాలు

చీరాల వస్త్ర దుకాణాల్లో విక్రయాలు జరుపుతున్న సరుకు నిత్యం మధ్యవర్తులు లేకుండా సూరత్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, బెనారస్, బొంబాయి ప్రాంతాల నుంచి దుకాణదారులకు చేరుతుంది. ఈక్రమంలో దాదాపుగా నాణ్యమైన సరుకునే కస్టమర్లకు విక్రయించడంతో పాటు

ఇతర రాష్ట్రాల నుంచి సరుకు దిగుబడి

బట్ట నాణ్యంగా ఉంటుండటంతో మార్కెట్‌కు గొప్ప పేరు వచ్చింది. దీంతో చీరాలకు విశాఖపట్నం, చిత్తూరు, శ్రీకాకుళం, తిరుపతి వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో వచ్చి కొనుగోళ్లు చేసేవారు.

సుమారు రూ. 2000 వరకు నెలవారీ జీతాలతో కుటుంబాలు పోషించుకునే వారు ఉన్నారు. అలాగే మార్కెట్‌కు అనుసంధానంగా వాసవీక్లాత్ మార్కెట్(80షాపులు), జాలాది కాంప్లెక్సు(20షాపులు), కామధేను కాంప్లెక్సు(60 షాపులు), ఆర్ఆర్ రోడ్డులో సుమారు 200 వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఇటీవల ఏర్పడిన మాల్స్ అలాగే వీటికి అనుసంధానంగా వివిధ రకాల అల్పాహారం, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్ వంటివి చాలానే ఉన్నాయి. మొత్తంగా ఈ పరిసరాల్లో సుమారు 10 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ దాదాపుగా వందల కోట్ల వ్యాపార వాణిజ్య సముదాయాలు ఉన్నాయి.

వ్యాపార రంగానికి గడ్డుకాలం

ఈక్రమంలో విరాజిల్లుతున్న వ్యాపార సముదాయాలకు గడ్డుకాలం వచ్చింది. డిజిటల్ వ్యవస్థ హోరెత్తుతున్న క్రమంలో ఎక్కువ మంది నేడు అన్ని వెంటనే కావాలని, తన దగ్గరకే రావాలని కోరుకుంటున్నారు.దీంతో ఆన్‌లైన్‌కు దగ్గరయ్యారు. ఇష్టమొచ్చిన మోడల్స్‌ను, అవసరమైన వస్తువులను ఇంట్లో కూర్చొనే బుక్ చేసుకుంటున్నారు. పైగా మార్కెట్ బయట ప్రయివేట్ వ్యక్తులు కమీషన్‌కు ఆశపడి వ్యాపారాలను దారి మళ్లిస్తున్నారు. మరోవైపు జీఎస్టీ, ఎంఎస్ఎంలు భారంగా మారాయి. దీంతో వ్యాపారాలకు గడ్డు పరిస్థితి ఏర్పడింది.

అక్రమం కాదు.. సక్రమమే

వంశీ అరెస్టుపై మంత్రి డోలా వ్యాఖ్య



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకమని, చట్టం తన పని తాను చేసుకుపోతోందని, పోలీసుల విచారణలో తప్పుచేసినట్లు తేలితేనే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. గురువారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడా అ క్రమ అరెస్టులకు పాల్పడలేదన్నారు. వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం విలువలకు కట్టుబడి పనిచేస్తుందని, టీడీపీ నాయకుల పట్ల గత ప్రభుత్వం వ్యవహరించినట్లు నేడు కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తే సగం మంది వైసీపీ నాయకులు జైళ్ల, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండేవారని ఆ యన వ్యాఖ్యానించారు. హామీ ఇచ్చిన మేరకు సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది వరకు అమ్మఒడి పథకాన్ని అమలు చేయలేదని ఆయన గుర్తుచేశారు.

ఆన్సర్‌బుక్‌లెట్ తీసుకెళ్లిన బీఈడీ విద్యార్థి

ఘటనపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు.. విచారణ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బీఈడీ విద్యార్థితీరుపై ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేశారు. సకాలంలో పరీక్షను పూర్తి చేసిన విద్యార్థి ఆన్సర్‌బుక్‌లెట్‌ను ఇన్విజిలెటర్‌కు ఇవ్వకుండా నేరుగా తాను బస చేసిన రూమ్‌కు తీసుకెళ్ళిన ఘటనపై శుక్రవారం యూనివర్శిటీ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీనిపై వైస్ చాన్సలర్ డీవీఆర్‌మూర్తి గురువారం గిద్దలూరులోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో చోటు చేసుకున్న ఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ సీడీసీ డీన్ జి.సోమశేఖర్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. వీసీ ఆదేశాల మేరకు సోమశేఖర్ శుక్రవారం గిద్దలూరులో జరిగిన ఘటనపై ఎస్‌వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలిరెడ్డి, యూనివర్శిటీ పరిశీలకుడు జయభారత్‌రెడ్డి, రూము ఇన్విజిలేటర్‌తో పాటు ఈఘటనకు ప్రధాన కారణమైన ఒడిశా రాష్ట్రానికి చెందిన విద్యార్థి నుంచి కూడా లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ సీఈ డాక్టర్ కేవీఎన్ రాజు, కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌లు ఉన్నారు.

అవీ..ఇవీ

కనిపించకుండా పోయిన వీఆర్వో

● కాలువ వద్ద స్కూటీ గుర్తింపు ● ఆందోళనలో కుటుంబ సభ్యులు


పాలుట్ల నాగరాజా రావు (ఫైల్)

త్రిపురాంతకం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టపాలెం వీఆర్వోగా పనిచేస్తున్న పాలుట్ల నాగరాజారావు శుక్రవారం ఉదయం నుంచి కనిపించడం లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. సెల్‌ఫోన్ ఇంట్లోనే ఉంచి ఉదయాన్నే తన స్కూటీతో బయటకు వచ్చిన నాగరాజారావు తిరిగి ఇంటికి రాలేదు. తన సమీప బంధువు ఒకరు వై.పాలెం వెళుతూ స్కూటీని గమనించి సమాచారం ఇవ్వడంతో వెతకడం ప్రారంభించారు. కుటుంబ సభ్యుల ద్వారా ఫిర్యాదు అందుకున్న ఎస్సై శివబసవరాజు తన సిబ్బందితో సాగర్ కాలువపై విశ్వనాథపురం వరకు పరిశీలించారు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది గాలిస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత


పట్టుబడ్డ రేషన్ బియ్యంతో సబ్ కలెక్టర్

కంభం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కంభం నుండి బేస్తవారపేటలోని ఒక రైసు మిల్లుకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకటత్రివినాగ్ స్థానిక రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసి సీజ్ చేయించారు. వివరాల్లోకి వెళితే కంభం పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఓ ఇంటి నుండి సుమారు 80 బస్తాల రేషన్ బియ్యాన్ని మినిలారీలో ఎక్కించి తరలిస్తున్నారు. దీంతో అదే వీధిలోని కొందరు రెవెన్యూ అధికారులకు, మార్కాపురం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు సమాచారం అందించగా రేషన్‌బియ్యం, వాహనాన్ని ఆపి కంభం తహసీల్దార్ వి.కిరణ్, బేస్తవారపేట తహసీల్దార్ జితేంద్ర, వీఆర్‌వోలు పోలీసులతో కలిసి మినిలారీని కందులాపురం కూడలిలోని జాతీయ రహదారిపై అదుపులోకి తీసుకుని కంభం ఫుడ్ కార్పోరేషన్ గోదాముకు తరలించారు. అక్రమ రేషన్ బియ్యాన్ని దించిన తరువాత మినిలారీని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. తహసిల్దార్ కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన ఏ వస్తువులైనా ఇలా అక్రమంగా తరలిస్తే ఎటువంటి వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో గోవులకు దాణా అందజేత

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని తాత్కాలిక గోశాలను బీజేపీ నాయకులు కమిషనర్ నారాయణరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నరేష్ కూరగాయాలు అందించారు. శివాలయం మాజీ ఛైర్మన్ కేశవరావు ట్రాక్టర్ గడ్డి ఇస్తానని వాగ్దానం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు పాదర్తి అంజనేయులు గోవులకు అవసరమైన దాణా నిత్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణారావు, కిరణ్, రవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయించండి

● కేంద్ర మంత్రికి బీజేపీ నాయకుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా ఒంగోలుకు వచ్చిన కేంద్రమంత్రి భూపతిరాజా శ్రీనివాసవర్మకు శుక్రవారం మార్కాపురం బీజేపీ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని, సందిగ్ధ స్థితిలో మెడికల్ కళాశాల సమస్య ను పరిష్కరించి పూర్తి చేయాలని వినతిపత్రం ఇచ్చారు. అదేవిధంగా వెనుకబడిన మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. పశ్చిమ ప్రకాశంలో 20వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, భారీ పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దళితుల శ్మశాన స్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో అధికారులు దళితులకు శ్మశన వాటిక స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. శనివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్‌లో దళితులు శ్మశాన స్థలం కోసం వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సర్వేయర్ సంజీవయ్య శ్మశానవాటిక స్థలం కోసం ప్రభుత్వ భూమిలో కొలతలు నిర్వహించారు. కౌన్సిలర్ హర్షితాబాబీ ఆధ్వర్యంలో దళితులకు శ్మశాన స్థలం కేటాయించిన ఎమ్మెల్యేకు దళితులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అంబవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంగలరెడ్డిపల్లె, వెల్లుపల్లె, జయరాంపురం, జయరాంపురంతాండా అంబవరం, ఉప్పలపాడు, కొండపేట, పాములపల్లె గ్రామాలలో సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 18వ తేదీ వరకు ఉదయం 8.45 నుండి మధ్యాహ్నం 2.45 గంటల వరకు, రాత్రి 9.00 గంటల నుండి అర్ధరాత్రి 12.00 గంటల వరకు త్రీఫేజ్ కరెంటు కోత విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు గమనించాలన్నారు.

నరసింహస్వామి అవతారంలో వేణుగోపాలుడు


సింహవాహనంపై వేణుగోపాలుడు

తర్లుపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి మువ్వగోపాలుడు నరసింహాస్వామి అవతారంలో ప్రజలకు దర్శనం ఇచ్చారు. కారంపూడి వెంకట రమణాచార్యులు, కూనపులి వెంకట రమణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారి రుక్మిణి సత్యభామ వేణుగోపాల స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై తీసుకొచ్చి తర్లుపాడు పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కాయా కర్పూరాలు సమర్పించి వార్లుపోసి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయ దాతలు వాడేలా వెంకట దత్తాత్రేయ శ్రీనివాసులు, ధర్మపత్ని లక్ష్మీప్రసన్న, వేంకట రమణ, ప్రకాశ్‌రాజ్, వెంకట సుబ్బారావు, రాధామాధవి, సుధాకర్ రావులు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉభయదాతల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్‌రావు, ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, వివిధ వాహ నాల ఉభయదాతలు వాడేల శివరావు, వాడేల కృష్ణప్రసాద్, కశ్శెట్టి జగన్‌బాబు, జవ్వాజి సత్యనారాయణ, పార్లపల్లి వెంకట ప్రసాద్‌లు, భక్తులు పాల్గొన్నారు.

నాటి పాపాలకే నేటి శిక్షలు

● వైసీపీ నేతలకు ఎరిక్షన్‌బాబు చురకలు ● కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చూడాలని హితవు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 14 : అధికార మదంతో నాడు వైసీపీ నేతలు చేసిన అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలు, పాపాలకు నేడు శిక్ష అనుభవిస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు విమర్శించారు. ఆ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాడు వైసీపీ నాయకులు బరితెగింపు, రాజకీయాలు చేసి నేడు తగు మూల్యం చెల్లించుకుంటున్నారన్నారు. నాడు గన్నవరం ఎమ్మెల్యేగా వంశీ అనేక అక్రమాలకు, అరాచకాలకు పాల్పడ్డారన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై పట్టపగలు రౌడీ మూకల్ని పంపిదాడి దాడి చేయించారన్నారు. అక్కడి టీడీపీ నేతల వాహనాలు తగుల బెట్టించడం దేశం మొత్తం చూసిందన్నారు. అయితే ఇది ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు కన్పించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రశేఖర్‌కు విషయ పరిజ్ఞానం తక్కువ, వితండవాదం ఎక్కువ అని విమర్శించారు. మైక్ ముందు నిల్చొని ఇష్టాను సారం మాట్లాడుతే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ, కిడ్నాపులు, బెదిరింపులకు పాల్పడితే అరెస్టు చేయరా..? అని ప్రశ్నించారు. పుల్లలచెరువు మండలంలో వైసీపీ నాయకుడు గడ్డం సుబ్బయ్య సిద్దన్నపాలెం గ్రామాన్ని తన పేరు మీద రిజిస్టర్ చేయించుకొని బ్యాంక్‌లోతాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నాడన్నారు. ఇది ప్రశ్నించివారిని గ్రామం నుంచి వెలివేయించాడన్నారు. ఇలాంటి వ్యక్తిని అరెస్టు చేయకుండా, సన్మానాలు చేస్తారా అని ఎద్దేవా చేశారు. ఇలాంటి కబ్జాకోరులు, రౌడీ మూకల్ని ఎమ్మెల్యే చంద్రశేఖర్ వెనుకేసుకోని రావడం సిగ్గుచేటన్నారు. తప్పు చేసిన వారిని అరెస్టు చేస్తే కులం అడ్డుపెట్టుకొని రాజకీయాలుచేస్తారా..? అని ప్రశ్నించారు.

అభివృద్ధి కనిపించడం లేదా..?

కోట్లాదిరూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నా, మీడియాకు ఎమ్మెల్యే చంద్రశేఖర్ తప్పుడు ప్రకటనలిస్తున్నారని ఎరిక్షన్‌బాబు విమర్శించారు. ఎర్రగొండపాలెంలో సాయిబాబా మందిరం వరకు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు వేయించినట్లు తెలిపారు. ఆ రోడ్డు నుంచే నిత్యం ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఇంటికి వెళుతున్నాడన్నారు. ఆ రోడ్డుపై తిరుగుతూనే రోడ్లు వేయలేదని ఎమ్మెల్యే ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గం నుంచి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్ , ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ఆవాసం ఉండే వసతిగృహ భవనాల మర్మత్తులకు నిధులు మంజూరు చేయలేదేన్నారు. ఆయన ఇంటి పక్కనే ఎస్సీ హాస్టల్ ఉంటే నాడు ఆవైపు కన్నెత్తి చూడలేదన్నారు. పాఠశాలల అభివృద్ధి పేరుతో నాడు నేడు పథకంలో కోట్లు దండుకున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఎక్కడ రోడ్లపై తట్టెడు మట్టి పోయలేదని వీళ్లు అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారన్నారు. దోర్నాలకు డిగ్రీ కళాశాల మంజూరైతే స్థలం మంజూరు చేయించలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక దోర్నాల మార్కెట్ యార్డు స్థలాన్ని డిగ్రీ కళాశాలకు మంజూరు చేయించినట్లు తెలిపారు.

మెగా జాబ్‌మేళాతో యువతకు మేలు

వెనుకబడిన ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని గ్రామాల్లో నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో ఎర్రగొండపాలెం కేంద్రంగా మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేయించినట్లు టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. ఎర్రగొండపాలెంలోని అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో శుక్రవారం మెగా జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి పర్యాయం జరిగిన జాబ్‌మేళాలో 160 మందికి ప్రవేటు కంపెనీలలో ఉద్యోగాలు పొందారన్నారు. ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉన్న నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పించేందుకు భవిష్యత్‌లో ఎంత ఖర్చుఅయిన భరించి జాబ్ మేళాలు ఏర్పాటు చేయిస్తానన్నారు. జాబ్ మేళాలో ఇంటర్వ్యూకు 270 హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ ఉపాధి కల్పనాధికారి రాజారావు, జేడీఏ శ్రీకాంత్, ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్.మల్లిఖార్జుననాయుడు, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంఈవో ఆంజనేయులు, జవహర్‌నాలెడ్జ్ కో-ఆర్డినేటరు పి.ప్రదీప్, ఎర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పుల్లలచెరువు మండల టీడీపీ అధ్యక్షులు పయ్యావుల ప్రసాదు, త్రిపురాంతకం మండల టీడీపీ అధ్యక్షులు మేకల వలరాజు, ద్వితీయశ్రేణి టీడీపీ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ గుమ్మా ఎల్లయ్య, వేగినాటి శ్రీను, బీవీ.సుబ్బారెడ్డి, మేడికొండ లక్ష్మీనారాయణ, మెడబలిమి అచ్యుతరావు, కాకర్ల కోటయ్య, కాశికుంట సర్పంచి మంత్రునాయక్, మాజీ సర్పంచి సత్యనారాయణగౌడ్, ఆళ్ల నాసరరెడ్డి, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు. ప్రవేటు కంపెనీల మేనేజర్లు, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

రీసర్వే సక్రమంగా నిర్వహించాలి

సిబ్బందికి జేసీ గోపాలకృష్ణ ఆదేశం


రైతులకు సూచనలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పొదిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నందిపాలెం గ్రామంలో జరుగుతున్న రీసర్వేను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీసర్వే జరుగుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే జరగే పొలాలకు సంబంధించిన రైతులకు నోటీసులు ఇచ్చారా..? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతులు ఇచ్చారని, మరికొందరు ఇవ్వలేదని ఆయనకు తెలిపారు. అధికారులు రైతులకు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. రెవెన్యూ అధికారులు సహకరించకపోతే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రీసర్వే జరిగే పొలాలకు సంబంధిత యజమానులకు తప్పకుండా నోటీసులు ఇవ్వాలన్నారు. సర్వే చేసే సమయంలో తప్పకుండా రైతులను పొలం వద్దకు పిలవాలన్నారు. అలా కాకుండా ఇష్టారీతిన సర్వే చేస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామంలో నాలుగు బృందాలుగా రీసర్వే నిర్వహించాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కృష్ణారెడ్డికి సూచించారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీసర్వే కార్యక్రమం చేపట్టిందని అందులో ఎలాంటి తప్పులు చోటుచేసుకున్నా, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. ఆయన వెంట కనిగిరి ఆర్డీవో శివరామిరెడ్డి, ఆర్‌ఐ నరసింహారావు, సర్వేయర్ గురవయ్య, వీఆర్వోలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గుర్తింపు సంఖ్యతో రైతులకు మేలు

రాష్ట్ర ప్రభుత్వం భూమి కలిగిన రైతులకు విశిష్ట గుర్తింపు నమోదు సంఖ్య ఇవ్వనున్నట్లు జేసీ గోపాలకృష్ణ తెలిపారు. మండలంలోని మాదాలవారిపాలెం రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దానివలన రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. రైతులు గుర్తింపుకార్డు పొందడం ద్వారా వ్యవసాయసేవలు సలభతర మౌతాయన్నారు. ప్రభుత్వ సేవలు వేగంగా అందుతాయన్నారు. ఫార్మర్ రిజిస్టర్ పోర్టల్‌లో నమోదు చేసిన తరువాత గుర్తింపు సంఖ్య కేటాయిస్తారన్నారు. కనుక రైతులు ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబరు, ఆధార్‌కార్డ్, పట్టాదార్ పాస్‌పుస్తకం తీసుకొని గ్రామ సచివాలయంలో రైతుసేవ సిబ్బందిని కలిసి గుర్తింపుకార్డు పొందవచ్చన్నారు. సమావేశంలో వ్యవసాయాధికారి షేక్ జైన్‌లాబ్దీన్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు కోర్టును కర్నూలు బెంచ్‌తో కలపాలి

గిద్దలూరు బార్ అసోసియేషన్ పరిధిలో న్యాయవాదుల నిరసన


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు కోర్టు పరిధిని కర్నూలు హైకోర్టు పరిధిలో కలుపాలని కోరుతూ శుక్రవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని అనుకున్న అప్పటి ప్రభుత్వం ఆ తరువాత అమరావతిలో హైకోర్టు ఏర్పాటు చేసిందన్నారు. అయితే అమరావతిలోని హైకోర్టుకు రాయలసీమ నుంచి కక్షిదారులు, న్యాయవాదులు చేరు కోవాలంటే అనేక అవస్థలు పడుతున్నారని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. రాష్ట్ర ప్రజలు, న్యాయవాదులు అనేక పోరాటాల ఫలితంగా కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. ఈ మధ్యకాలంలో ప్రకాశం జిల్లాను అమరావతి హైకోర్టులో ఉంచాలని పలువురు కోరుతుండడంతో ఈ విషయమై నిరసన తెలియజేస్తున్నట్లు బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షులు పాలుగుళ్ల శేషైనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఉస్మాన్‌షరీఫ్, ట్రెజరర్ ముత్తుముల రంగా రెడ్డి, న్యాయవాదులు వల్లెల వెంకటరామిరెడ్డి, పిడతల రాజశేఖర్‌రెడ్డి, తురగ అంజన్‌కుమార్, హజరాంబీ, హిమశేఖర్‌రెడ్డి, రవిప్రకాశ్‌బాబు, దాసరి సంగీతరావు తదితరులు ఉన్నారు.

మాజీ సీఎంకు ఘన నివాళి


సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశ తొలి దళిత సీఎం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా స్థానిక గ్రాంథాలయంలో గ్రాంథపాలకురాలు కె రూస్సీ అధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. శుక్రవారం గ్రంథాలయంలో ప్రభుత్వ పాఠశాలలకు చెంది న విద్యార్థులతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు గురించి వివరించారు. ఆలాంటి మహోన్నత వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

పెద్దదోర్నాల : స్థానిక గ్రంథాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి గ్రంధ పాలకుడు వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యా యులు చందు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చందు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీ వయ్య ఆదర్శనీయులని, ప్రధానంగా బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతిగా పేర్కొన్నారు.

వ్యవసాయ ఉపకరణాలను రైతులకు అందుబాటులో ఉంచాలి

● ఏడీఏ బాలాజీనాయక్

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో కమ్యూనిటీ హయ్యరింగ్ సెంటర్‌ల ద్వారా రైతులకు రాయితీ పై ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్ ఇతర ఉపకరణాలను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆత్మపీడీ విజయనిర్మల కోరారు. మండలంలోని రైతుసేవా కేంద్రాలను, కమ్యూనిటీ హాయరింగ్ సెంటర్‌లను శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు ఏడీఏ బాలాజి నాయక్, జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో శ్రీనివాసనాయక్, ఎఓ శ్రీనివాసులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు లబ్దిదారులతో మాట్లాడుతూ ట్రాక్టర్ పరికరాల అద్దె ధరల పట్టికను రైతులకు తెలియజేయాలన్నారు. గ్రామంలో రైతులు నిర్ణయించిన కనీస ధరకు ట్రాక్టర్ పనిముట్ల సేవలను అందిచాలని తెలిపారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రాల సిబ్బది పాల్గొన్నారు.

విధుల్లో అలక్ష్యం వహిస్తే సహించేది లేదు

మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్


సచివాలయాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విధుల్లో అలక్ష్యం వహిస్తే సహించేది లేదని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ రెవిన్యూ సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకటత్రివినాగ్ శుక్రవారం ఆకస్మిక తనీఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కిన్నెరశాంతి, డిప్యూటీ తహసీల్దారు సాలమ్మ కార్యాలయంలో కనిపించలేదు. దీంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. సిబ్బందిని విచారించగా భూముల రీసర్వే నేపథ్యంలో చిన్నదోర్నాల, చిన్నగుడిపాడు గ్రామాలలో పరిశీలించేందుకు వెళ్లినట్లు సబ్ కలెక్టరుకు తెలిపారు. దీంతో తహసీల్దారు కార్యాల యానికి సమస్యల పరిష్కారం కోసం వచ్చిన లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. సమస్య ఏమిటి ఎన్నాళ్లుగా తిరుగుతున్నారు అని ప్రశ్నించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

23 నుంచి ఆలయ వార్షికోత్సవం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని మడియాలేశ్వరస్వామి పంచమ వార్షికోత్సవం 23 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమేరకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందచేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ఆహ్వాన పత్రికను అందచేశారు.


ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేస్తున్న కమిటీ సభ్యులు

జగదాంబకు ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక మార్కండేశ్వర స్వామి ఆలయంలో వెలసిన జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామికి శుక్రవారం పూజలు నిర్వహించారు. అర్చకులు వరుణ్‌తేజ శర్మ జగదాంబ మాతకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కుంకుమార్చన, విశేష పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేవవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

ఆలయ రోడ్లను పరిశీలించిన జడ్పీ సీఈవో


అధికారులకు సూచినలిస్తున్న జడ్పీ సీఈవో చిరంజీవి

త్రిపురాంతకం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వెళ్లే రోడ్డు, ఆలయం నుండి కిందికి వెళ్ళేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డును జడ్పీ సీఈవో చిరంజీవి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఉత్సవాల నేపథ్యంలో జరిగిన సమావేశాల్లో సబ్‌కలెక్టర్ సూచనల మేరకు రోడ్లను పరిశీలిచారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్లకు ఇరువైపులా మార్జిన్‌లు, ప్యాచ్ వర్కులు పూర్తి చేయాలని, ఆర్ అండ్ బీ, పీఆర్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ బాలశంకరరావు మాట్లాడుతూ పంచాయితీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ భక్తులకు తాగునీటి వసతిని మెరుగ్గా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కుమార్, ఈవో పీఆర్‌డీ రామసుబ్బయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కంభం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయప్రకాశ్ వీధిలోని షిర్డిసాయిబాబా మందిర 9వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ పీవీఎస్‌పీ.సునీల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డాక్టర్లు కె.క్రిష్ణ, కె.చక్రవర్తి, జి.రాఘవేంద్రలు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతకుముందుగా ఆలయంలో లక్ష్మీనారాయణ, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

జమా ఖర్చు బోర్డు ఏర్పాటు చేయాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానంలో జమ ఖర్చు బోర్డును ఏర్పాటు చేయడం లేదని బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్ దేవదాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.7లక్షల రూపాయల మేర దొంగబిల్లులు సృష్టించి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. అందుకే జమ ఖర్చు బోర్డు వేయడం లేదన్నారు. ఈ విషయంగా దేవస్థాన ఈవో చిక్కుడు శ్రీనివాసులును ప్రశ్నిస్తే బోగస్ జీవో చూపించి తమను మోసగించే ప్రయత్నం చేశాడని ఉదయ్‌శంకర్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. గుంటూరులో నివాసం ఉంటూ వారానికి ఒక రోజు మాత్రమే విధులకు హాజరవుతున్నాడన్నారు. పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రం నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి


నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

పొదిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తపాలాశాఖలో పలురకాల సేవలను ప్రైవేటుపరం చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని ఎన్ఎఫ్‌పీఈ యూనియన్ డివిజన్ అధ్యక్షులు ఎం శ్రీనివాసులు కోరారు. స్థానిక తపాలా ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన సిబ్బంది గేట్‌మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే ఐడీసీహబ్‌ల ఏర్పాటుకు సన్నాహకాలు పూర్తయ్యాయన్నారు. దీని వల్ల 4.50 లక్షల మంది ఉద్యోగుల భవితవ్యం ప్రమాదకరంగా మారుతోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ సాయిరాం, పోస్ట్‌మాన్ సంఘ కార్యదర్శి బి ఈస్టర్‌పాల్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

పొదిలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నవ్యాంధ్ర దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాన్ని రాజీవ్‌నగర్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఫౌండర్ నరసింహారావు, రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ దివ్యాంగులకు, వృద్ధులకు ఎన్నో ఏళ్లుగా వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు. అయితే ఇప్పుడు హోప్‌హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వారి సహకరంతో ఏర్పాటు చేశామన్ననరు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బ్రహ్మారెడ్డి కోశాధికారి రాధ, శ్రీను, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సబే బరాత్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): షబాన్ మాసంలో 15వ రోజు వచ్చే సబే బరాత్‌ను మార్కాపురం పట్టణంలో ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పట్టణంలోని మసీదులలో సబేబరాత్ జల్సా నిర్వహించారు. స్థానిక మర్కస్ జామియా మసీద్‌లో ఇషా నమాజ్ అనంతరం ముఫ్తీ మహమ్మద్ మిన్హాజ్ సబే బరాత్‌పై ప్రసంగించారు. ఇస్లాం ఒక జీవన విధానం అని ప్రతి ఒక్కరూ ఇస్లాం సూత్రాలు ఆచరించాలన్నారు. ఇస్లాంలో శాంతి, ప్రేమ, పరమత సహనం, జాలి, దయగుణం ఇమిడి ఉన్నాయన్నారు. పొరుగువారికి సహాయ పడే గుణం అలవర్చుకొని మంచిని ప్రోత్సహించాలన్నారు. మేలు చేయకపోయినా కీడు తలపెట్టవద్దన్నారు. 15 రోజులలో రానున్న రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉండి నమాజ్‌ను చదివి పేదలకు దానధర్మాలు చేయాలన్నారు. అనంతరం గొర్లగడ్డ వీధికి చెందిన చిన్నారులు తాము నేర్చుకున్న సూరాలు, నాత్‌లతో ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ముఫ్తీ మహమ్మద్ మిన్హాజ్ సర్వమానవాళి సంక్షేమం కోసం ప్రత్యేక దువాలు నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాంతాలలో కబరస్తాన్‌లకు వెళ్లి చనిపోయిన వారి ఆత్మల శాంతి కోసం దువాలు చేశారు. మసీదులకు వచ్చి ప్రత్యేక నమాజ్‌లు చదివి ఖురాన్ పఠనంతో పాటు దైవచింతనలో జాగారం చేశారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

దర్శి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శుక్రవారం దర్శిలో ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీపీ జి.సుధారాణి, దళిత ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు సంజీవయ్య అని కొనియడారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల పోరాట సంఘం అధ్యక్షుడు కె.గోవిందప్రసాద్ మాదిగ, దళిత సేన నియోజకవర్గ నాయకులు జి.ప్రేమ్‌కుమార్, ఎం.ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

పామూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం మండలంలోని దూబగుంటలో చోటుచేసుకుంది. ఎస్టీ కాలనీలో రాగి పోలయ్యకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. పూరిల్లుకు మంటలు అంటుకున్న సమయంలో అందులోఉన్న పోలయ్య భార్య బయటకు పరుగులుతీసింది. ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిద కావడంతో బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది.

ప్రమాద సమాచారాన్ని వీఆర్వో కేసీ వెంకటస్వామికి గ్రామస్థులు తెలియజేశారు. ఆయన ప్రమాదస్థలాన్ని పరిశీలించి తహసీల్దార్‌కు వివరాలు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ గ్రామ దైండే శివశంకర్, ఉడుముల ప్రభాకర్‌రెడ్డి కోరారు.

కేంద్రమంత్రి దృష్టికి దొనకొండ సమస్యలు

దొనకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ దృష్టికి బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రొడ్డా వెంకటరామయ్య తీసుకెళ్లా రు. శుక్రవారం ఒంగోలులో జరిగిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగ్గం శ్రీనివాసరావు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్రమంత్రి హాజరయ్యారు. ఈసందర్భంగా వెంకటరామయ్య కేంద్రమంత్రిని కలిసి దొనకొండ ప్రజల సమస్యలను వివరించారు. అందుకుస్పందించిన కేంద్రమంత్రి సంబంధిత అధికారుల తో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.మునెయ్య, పి.వెంకటరామయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో గౌతమీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

దొనకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో దొనకొండ గౌతమీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కాలేజీ అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) వివరించారు. బీకాం కంప్యూటర్ విభాగంలో పి.సుబ్బయ్య 567 మార్కులు, సీహెచ్ సీమోను 546 మార్కులు, ఎస్.శాంతకుమారి 543 మార్కులు సాధించారు. బీఏ విభాగంలో షేక్ నాజ్ 509 మార్కులు, ఎం.సానియామీర్జా 464 మార్కులు, ఎస్.సువర్ణ 432 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కె.గుండారెడ్డి, సీఈవో నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపకులు అభినందించారు.

భూఆధార్ నమోదు చేయించుకోవాలి

పామూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు నమోదు కోసం వ్యవసాయ భూమి కలిగిన రైతులందరూ సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో భూఆధార్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రాధ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో విశిష్ట సంఖ్య గుర్తింపు నమోదు ప్రక్రియను పరిశీలించారు.

ఈసందర్భంగా పలువురు రైతుల నుంచి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ పత్రాలను తీసుకొని భూఆధార్ నమోదు చేయించారు. ఇది చేయించుకొంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. ఈ నెలాఖరునాటికి రైతులందరూ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఎం.నగేష్, వీఏఎస్‌లు బి.తిరుమలరావు, టి.భువన, షేక్ లాబ పాల్గొన్నారు.

విద్యార్థుల కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కంటి చూపుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఒంగోలు మోడరన్ ఐహాస్పటల్ చైర్మన్ డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏబీసీ హైస్కూల్‌లో మోడరన్ కంటి వైద్యశాల వైద్యులు మారం వెంకటరమణారెడ్డి, డి.అర్పణ పాసర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 619 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 54మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ టి.శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ కాలేషాబాబు, పీఆర్వో సురేంద్ర, టెక్నిషియన్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నత్తనడకన 'అమృత్‌భారత్'

» రెండేళ్లుగా అరకొరగా పనులు
» దొనకొండ రైల్వేస్టేషన్ ముందు సిమెంట్ రోడ్లతోనే సరిపెట్టిన వైనం


దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఓవర్‌బ్రిడ్జి నిమిత్తం ప్రస్తుతం తవ్విన పునాదులు

దొనకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ల అభివృద్ధి నిమిత్తం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్‌భారత్ పథకంలో దొనకొండ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. రైల్వేస్టేషన్ ముందు కొంతభాగం హడావుడిగా సిమెంట్ రోడ్ల పనులు చేపట్టి మిగిలిన పనులు నిలిపివేశారు. నిర్వాహకులు అప్పుడప్పుడు వచ్చి పనులు ప్రారంభించి హడావుడి చేయటం, తిరిగి కొన్నిరోజులు నిలిపివేయటం పరిపాటిగా మారింది. మిగిలిన రైల్వేస్టేషన్లల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నా.. దొనకొండలో మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.

చిన్న రైల్వేస్టేషన్లు సైతం మహానగరాల్లోని రైల్వేస్టేషన్లతో దీటుగా ఉండాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఆధునికీకరణ చేపట్టింది. ఇందుకుసంబంధించి ప్రవేశపెట్టిన అమృత్‌భారత్ పథకంలో దొనకొండ రైల్వేస్టేషన్ ఎంపికైంది. ఈస్టేషన్‌లో దాదాపు రూ.18 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023 ఆగస్టు 6న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమాన్ని రైల్వే అధికారులు ఎంతో ఆర్భాటంగా నాడు నిర్వహించారు.

ఈసందర్భంగా అప్పటి గుంటూరు రైల్వే డివిజనల్ అసిస్టెంట్ మేనేజర్ ఆర్.శ్రీనివాస్ అమృత్‌భారత్ పథకం ఉద్దేశం, చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 2024 మార్చి నాటికి యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని ప్రకటించారు.



దొనకొండ రైల్వేస్టేషన్ నమూనా

అమృత్ భారత్ పథకంలో దొనకొండ రైల్వేస్టేషన్ ముందుభాగం ఏవిధంగా రూపుదిద్దుకుంటుందో నమూనా చిత్రాన్ని అప్పట్లో రైల్వేస్టేషన్ ఆవరణలో పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి ప్రదర్శించారు. అయితే, నత్తనడకన జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా చూస్తున్న ప్రజలు రైల్వే అధికారులు ప్రకటించిన విధంగా దొనకొండ రైల్వేస్టేషన్ అభివృద్ధి చెందుతుందా? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అమృత్ భారత్ పథకంలో దొనకొండ రైల్వేస్టేషన్‌లో ముందుభాగంలో అధునాతన వెలివేషన్, ప్లాట్‌ఫాం ఆధునికీకరణ, షెడ్ల ఏర్పాటు, లిఫ్ట్ సౌకర్యంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతన వెయిటింగ్ హాల్ తదితర పూర్తి సౌకర్యాలు ఏర్పాటవుతాయని రైల్వే అధికారులు వెల్లడించారు. శంకుస్థాపన చేసి దాదాపు రెండేళ్లు గడుస్తున్నా కొద్దిపాటి సిమెంట్ రోడ్లు, ప్లాట్‌ఫాంపై షెడ్ల నిమిత్తం ఏర్పాటుచేసిన పిల్లర్లు మినహా ఎటువంటి పనులు జరగలేదు. ఇప్పటికైనా రైల్వే అధికారులు అమృత్ భారత్ పథకంలో ఎంపికైన దొనకొండ రైల్వేస్టేషన్‌కు మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో కేటాయించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

» డీఎస్పీ లక్ష్మీనారాయణ



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

తాళ్లూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్టు డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం తాళ్లూరు పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుంటూ నేరాల అదుపుపై చర్యలు చేపట్టినట్టు చెప్పారు. దర్శి డివిజన్ పరిధిలోని గ్రామాల్లో వందల సంఖ్యలో నిఘా నేత్రాలు(సీసీ కెమెరాలు) ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో మార్చి చివరినాటికి అన్నిగ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీజీపీ, ఎస్పీ ఆదేశానుసారం సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. రాత్రిళ్లు పోలీస్ గస్తీల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఈసం దర్భంగా తాళ్లూరు స్టేషన్‌లో కేసుల పురోగతి, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, రికార్డులను డీఎస్పీ లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. ఫిర్యాదులు చేసేందుకు వచ్చే మహిళల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక గదిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.మల్లికార్జునరావు, ఏఎస్సై మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

పీసీపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై శుక్రవారం డీఎల్‌పీవో హనుమంతరావు విచారణ చేశారు. ఇందుకు సంబంధించి పలువురు వార్డుమెంబర్లు, గ్రామస్థులు ఇటీవల కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదుచేశారు. ఆమె ఆదేశాల మేరకు స్థానిక సచివాలయంలో ఫిర్యాదుదారులు, ప్రజల సమక్షంలో విచారణ చేపట్టారు. ప్రస్తుత సర్పంచ్ మరియమ్మ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జరిగిన అభివృద్ధి పనులకు డ్రా చేసిన నిధులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. తీర్మానం, ఎంబుక్, క్యాష్‌బుక్ తదితర రికార్డులను ఆయన పరిశీలించారు. పాల కేంద్రం నిర్మాణమే చేపట్టకుండా రూ.2 లక్షలు ఎలా ఇచ్చారని సర్పంచ్, కార్యదర్శిని ఆయన ప్రశ్నించారు. ఇంజనీరింగ్ అధికారి అడ్వాన్స్ కింద ఎఫ్‌టీవోలు ఇవ్వడంతో నిధులు డ్రా చేసి ఇచ్చామని కార్యదర్శి చెప్పారు.

ఫిర్యాదుదారులలో ఒకరైన సత్యంరెడ్డి కలుగజేసుకుని కేవలం రికార్డులనే పరిశీలించడం కాకుండా రికార్డుల్లో పనులు చేశామని చెప్తున్న ప్రాంతాలకు వెళ్లి అక్కడ పని జరిగిందా లేదా అనేది కూడా పరిశీలించాలని డీఎల్‌పీవోను కోరారు. మంగళవారం రికార్డుల్లో చూపించిన పనులను పరిశీలిస్తామని చెప్పారు. ఈ విచారణలో ఈవోపీఆర్డీ మల్లేశ్వరి, గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి తీవ్రగాయాలు

పీసీపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పొలం వివాదంలో జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన గురువారం రాత్రి మండలంలోని మురుగుమ్మిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేర కు.. గ్రామానికి చెందిన వల్లెం రాజశేఖర్‌రెడ్డి, లెక్కల వెంగళ్‌రెడ్డి మధ్య కొం తకాలంగా పొలం విషయమై వివాదం నెలకొంది. దీనిపై వెంగళ్‌రెడ్డి కోర్టుకు వెళ్లడంతో ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈతీర్పుపై స్టే కోరుతూ పిటిషన్ దాఖలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈక్రమంలో కోర్టు ఆర్డరు పొందిన వెంగళ్‌రెడ్డి సదరు పొలంలో ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయిస్తున్నాడు. గురువారం రాత్రి వెంగళ్‌రెడ్డి, తన స్నేహితుడు శబరికంతా రెడ్డితో కలిసి గ్రామంలో ఉన్న దుకాణం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వెళు తుండగా, రాజశేఖర్‌రెడ్డి మరికొంతమంది కలిసి దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిరువురిని చికిత్సకోసం కనిగిరి వైద్యశాలకు తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

వెంగళ్‌రెడ్డి రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా, శబరికంతారెడ్డి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ప్రైవేటు వైద్యశాలలో చేర్పినట్లు తెలు స్తుంది. విషయం తెలుసుకున్న కనిగిరి సీఐ ఖాజావలి ఎస్సై కోటయ్యతో కలిసి శుక్రవారం ఉదయం గ్రామాన్ని సందర్శించారు. ఘర్షణకు సంబం ధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు. బాధితుల నుంచి ఒంగోలు పోలీసులు రికార్డుచేసి పంపించిన స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై కోటయ్య తెలిపారు.

యథేచ్ఛగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు

» పట్టించుకోని పోలీసులు
» ఇబ్బందులు పడుతున్న రైతులు

తాళ్లూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామగ్రి చోరీకి గురవుతుంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడు నెలల్లో తాళ్లూరు మండలంలోని 16 పంచాయతీల్లోని ఒక పంచాయతీ వినహా అన్ని గ్రామాల్లో 40 ట్రాన్స్‌ఫార్మర్ల సామగ్రి చోరీ జరిగిందని విద్యుత్ అధికారులు అధికారికంగా గుర్తించినట్లు సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్‌లోని పరికరాల విలువ తక్కువగా ఉన్నప్పటికీ ఎంతోకొంత గిట్టుబాటు అవుతున్నదని దొంగతనాలకు పాల్పడుతున్నారు.

పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగితీగను అపహరిస్తున్నారు. మోటార్లు ఆడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలను దొంగిలిస్తున్నారు. మండలంలోని తాళ్లూరు, తురకపాలెం, దారంవారిపాలెం, విఠలాపురం, లక్కవరం, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు, రజానగరం, రమణాలవారిపాలెం, దోసకాయలపాడు, మాధవరం, సోమవరప్పాడు, బెల్లంకొండవారిపాలెం, కొర్రపాటివారిపాలెం, శివరాంపురం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు జరిగినట్లు విద్యుత్ అధికారులకు రైతులు విన్నవించారు. ఇంకా కొందరు రైతులు పొలాల్లో దొంగతనాలపై అధికారులకు పెద్దగా ఫిర్యాదు చేయటం లేదు. ఈ కేసులపై స్థానిక పోలీసులు ప్రత్యేకంగా శ్రద్ధ చూపరని, వాటికోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగటం దండగని కొంతమంది రైతులు చోరీకి గురైన వైరును మరలా ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో దొంగలు ఒక రైతుకు చెందిన పొలాల్లో ఎక్కువసార్లు దొంగతనాలకు పాల్పడ్డ ఘటనలు ఉన్నాయి. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగను వందల రూపాయలకు అమ్ముకుంటే తిరిగి వాటిని ఏర్పాటు చేసుకోవాలన్నా, వైర్లను ఏర్పాటు చేయాలన్నా వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు జరిగిన రోజే విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. విద్యుత్ అధికారుల సమా చారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వెళ్లటం తప్ప ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు అధిక సంఖ్యలో చోరీకి గురవుతున్నా పోలీసులు పాత నేరగాళ్లపై దృష్టిసారించి విచారణ చేపట్టక పోవటం పట్ల రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో చిన్న సంఘటనలు జరిగినా స్పందిస్తున్న పోలీసులు వ్యవసాయ పనిముట్లు, ట్రాన్స్‌ఫార్మర్లను యథేచ్ఛగా చోరీ చేసి నష్టపరుస్తున్నా పట్టించుకోవడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. పోలీసుశాఖ స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను అదుపులోకి తీసుకుని చర్యలు చేపట్టాలని రైతులు, విద్యుత్ అధికారులు కోరుతున్నారు.


తురకపాలెం పొలాల్లో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్


బెల్లంకొండవారిపాలెంవద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసంచేసి బయటపడేసిన పరికరాలు


సోమవరప్పాడుగ్రామం వద్ద పగులకొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కనిగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం సమీపాన ఉన్న అయ్యప్పస్వామి దేవాలయం వద్ద కొండపై గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు సీఐ ఖాజావలి తెలిపారు. సమీపంలోని బీసీ కాలనికి చెందిన ప్రజలు సమాచారాన్ని ఇవ్వటంతో సంఘటనా స్థలికి సీఐ తన సిబ్బంది వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు.

మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతిచెంది నాలుగు రోజులకుపైగా ఉంటుందన్నారు. చిల్లచెట్ల మధ్య చీకటిగా ఉండటంతో బయటికి తీసేందుకు వీలు కాలేదన్నారు. శనివారం మృతదేహాన్ని బయటకు తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

సక్రమంగా రీసర్వే నిర్వహించాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడులో జరుగుతున్న రీ సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి, స్పెషల్ సబ్‌కలెక్టర్ ఎస్.జాన్సన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వేంపాడు గ్రామంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ రీసర్వేలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ప్రధానంగా రికార్డులు చూసుకొని సర్వే చేయాలన్నారు. రీసర్వే చేసే సమయంలో సంబంధిత రైతులను పిలిపించి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలన్నారు. గతంలో రికార్డుల్లో తప్పులు ఉంటే ప్రస్తుతం సరిచేయాలన్నారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ కోటం రాజు, ఆర్ఐ మూర్తి, వీఆర్‌వోలు దయానందం, బ్రహ్మతేజ, కోటయ్య, గురవయ్య, అయ్యపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీరారెడ్డి, నాయకులు

పామూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నిధులు కేటాయించాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జీవైఆర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ. రెండు వేల కోట్లు కేటాయించాలని కోరుతూ ఈనెల 17 రెవెన్యూ డివిజన్ కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. కర్నాటకలో ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచడంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులకు తగినంత నికర జలాలు లేక ప్రశ్నార్థకంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిచి పోయిన రెండవ టన్నెల్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

కనిగిరిలోని ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సయ్యద్ మౌలాలి, కె.ప్రభాకర్, వి.సుబ్బారావు, పి.రఘునాథరెడ్డి, ఆర్.సూరిబాబు, ఆకుల మోహన్‌రావు, ప్రసాద్, ఇర్రి వెంకటరెడ్డి, చాంద్‌బాషా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు

ముండ్లమూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించ వచ్చునని దర్శి డివిజన్ ఏడీఏ బాలాజీనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కెల్లంపల్లిలో శనగ పైరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు, ఎరువులు వాడవద్దన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం ఎంతో మేలన్నారు. తెగుళ్ళు కూడా పెద్దగా ఆశించవన్నారు. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించి పంటలు సాగు చేసుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. పంట కోత సమయం దగ్గర పడుతున్నందున పురుగు మందుల అవశేషాలు లేకుండా చూసుకోవాలన్నారు. శనగలో ప్రస్తుతం తీసుకోవాల్సిన సస్యరక్షణ గురించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్, వీఏఏ గిరిబాబు, రైతులు పాల్గొన్నారు.

వెలిగొండకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

కనిగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఐ నాయకుడు వై.రవీంద్రబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక దర్శి చెంచయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలాన్ని ప్రాజెక్టు పరిధిలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు యాసిన్, జీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న తహసీల్దార్ ఇమ్మానియేల్‌రాజు

తాళ్లూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని తహసీల్దార్ జె.ఇమ్మానియేల్‌రాజు అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండలస్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్యదశ నుంచే పిల్లలు చెడుమార్గాలవైపు వెళ్లకుండా సత్ప్రవర్తనతో ముందుకు సాగేలా చూడాలన్నారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో ఎస్.సత్యం, వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, వైద్యాధికారి రాజేష్‌యాదవ్, ఏపీఎం దేవరాజ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, డీటీ ప్రశాంత్ పాల్గొన్నారు.

నకిలీ వస్తువులు విక్రయిస్తే చర్యలు

పామూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నకిలి వస్తువులు విక్రయిస్తే చట్టపరంగా శిక్షలు తప్పవని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నరసింహుడు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు వ్యాపార దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. దుకాణాల్లోని పలు వస్తువుల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్టు తెలిపారు. పరీక్షల్లో నకిలి అని తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలం చెల్లిన వస్తువులను విక్రయించరాదని సూచించారు. అతని వెంట ఏపీ కన్స్యూమర్ రైతు ప్రొడక్షన్ ఫారం జిల్లా కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ రషీద్ ఉన్నారు.

డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకురావాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో ఆర్.జనార్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెదఉల్లగల్లు డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటినుంచి సేకరించిన చెత్తను యార్డుకు తీసుకొచ్చి వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. ఇందులో వచ్చిన ఆదాయాన్ని గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు వినియోగించాలన్నారు. గ్రామ ప్రధాన వీధుల్లో చెత్తాచెదారం లేకుండా గ్రీన్ అంబాసిడర్లు చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జనమాల నాగేంద్రం పిచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరాలి

పామూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలు పాఠశాలలకు వెళ్లాలని ఎంపీడీవో బి.సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 0-6 సంవత్సరం పిల్లల ఆధార్ అప్‌డేషన్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంఈవో డీవీ సుబ్బారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జి.పద్మజ, పార్వతి, ఏపీఎం జి.విద్యాసాగర్, కానిస్టేబుల్ శ్రీనివాసులు, షేక్ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.



కృత్రిమ మేధపై పరిజ్ఞానం అవసరం

● వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నేటి సాంకేతిక యుగంలో ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతున్న కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్) ప్రయోజనాలు, ప్రమాదాలపై విద్యార్థులు విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. సదస్సు ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య మాట్లాడుతూ ఈ సదస్సు విద్యార్థుల విజ్ఞానానికి ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. మైక్రోసాఫ్ట్ సంస్థకు చెందిన ఏఐ డేటా ప్రత్యేక ప్రతినిధి శేఖర్ రాజు మాట్లాడుతూ కృత్రిమ మేధను మానవ అద్భుతసృష్టిగా భావించేవారు కొందరైతే, సాంకేతిక సమస్యగా చూసేవారు కొందరని అన్నారు. క్వాడ్రెంట్ టెక్నాలజీస్ సేల్స్ మేనేజర్ ఆర్.రవి, మైక్రోసాఫ్ట్ టెక్ సేల్స్ సౌత్ ఇండియా ప్రతినిధి శ్రీకాంత్ కురూప్, అస్యూర్ సొల్యూషన్స్ ప్రత్యేక ప్రతినిధి అన్షుమాన్ అగర్వాల్, డాక్టర్ వేమూరి రవి, ఐమర్ సొసైటీ ఇండియన్ సర్వర్స్ సీఈవో డి.సాయిసతీష్ విద్యార్థులకు కృత్రిమ మేధకు సంబంధించిన అంశాలను తెలియజేశారు. ఈ వర్క్‌షాప్‌లో కంప్యూటర్ సైన్స్ ,ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ జి.నీలిమ, డాక్టర్ యు.సూర్య కామేశ్వరి, డాక్టర్ ఆర్.వసంత, పుష్పలత, బసవేశ్వరరావు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు

వ్యర్థాల నుంచి విముక్తి



- ప్రభుత్వ ఆస్పత్రులకు మార్గదర్శకాలు జారీ
- ఆస్పత్రుల్లో గుట్టలుగుట్టలుగా బయో వ్యర్థాలు
- 45 రోజుల్లో పనికిరాని వాటిని గుర్తించి వేలం

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఉపయోగంలో లేని, పనికిరాని వైద్య పరికరాలు, సామగ్రి, ఇతర వస్తువులు భారీగా పేరుకు పోవడంతో స్థలం కొరతతో ఇబ్బం దులు పడుతున్న గుంటూరు ప్రభుత్వాస్పత్రికి ఊరట లభించ నుంది. జీజీహెచ్‌లో ఎక్కడ చూసిన గుట్టలుగా పేరుకుపోయిన ఐరన్ స్క్రాప్ దర్శనమిస్తుంది. ఇలాంటి పనికిరాని ఐరన్ ఫర్నీచర్ నిల్వలతో ఎదురవుతున్న సమస్యల్ని సమీక్షించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వాటిని వదిలించుకునేందుకు నూతన మార్గదర్శ కాల్ని గురువారం ప్రకటించింది. ఇప్పటి వరకు అమలులో ఉన్న నిబంధనల మేరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడిసి)కి చెందిన బయో మెడికల్ ఇంజనీర్లు వ్యర్థ పదార్థాల్ని నిర్ధారించి వాటిని వేలం ద్వారా విక్రయించుకోవడానికి(డిస్పోజల్) నివేదికలు ఇస్తేనే ప్రభుత్వాస్పత్రులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ బయోమెడికల్ ఇంజనీర్ల కొరతతో ఈ దిశగా వ్యర్థాల్ని వదిలించుకునే ప్రయత్నాలు చేయలేదు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) ద్వారా ఈ వ్యర్థాల్ని వదిలించుకోవాలన్న నిబంధన ఉంది. ఈ విషయంలో సీఎస్ఐఆర్ సహకారం కొరవడడంతో వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి.

ఈ అవరోధాల్ని గమనించిన వైద్య ఆరోగ్య శాఖ, వ్యర్థాల డిస్పోజ్‌కు సంబంధించిన నియామాల్లో (మిగతా 6వ పేజీలో)



స్వచ్ఛతకు.. ర్యాంకులు

- విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 14 సూచకలు.. 200 పాయింట్ల ఆధారం
- 117 పాయింట్లతో గుంటూరుకు 8వ ర్యాంకు
- 115 పాయింట్లతో 9వ స్థానంలో బాపట్ల జిల్లా
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో వెనకబడిన పల్నాడు..
- ఇంటింట చెత్త సేకరణ, కార్యాలయాల శుభ్రతపై నేడు కార్యక్రమం

గుంటూరు సిటీ, బాపట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆయా కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన.. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర మిషన్‌కు శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యే క థీమ్‌ను ఎంచుకుని ప్రభుత్వ సిబ్బందితో పాటు ప్రజలను, విద్యార్థులను భాగస్వాములను చేసి అత్యంత శుభ్రత కలిగిన జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిన సంగతి తెలిసిందే. ఇందుకు అనుగుణంగా మార్గదర్శకాలను రూపొందించిన ప్రభుత్వం వాటిని యంత్రాంగం తప్పనిసరిగా పాటించాల్సిందేనసే ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 14 సూచకలకు అంశాల వారీగా 200 పాయింట్లు కేటాయిం చింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, డోర్ టు డోర్ కలక్షన్, చెత్త నిర్వహణ, విభజన, కమ్యూనిటీ సోక్ పిట్స్, క్లీన్ విలేజ్, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి అంశాలతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని తొలివిడతలో భాగంగా మూడో శనివారమైన జనవరి 18న ప్రభుత్వం చేపట్టింది. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం, పరిశుభ్రమైన వాతావరణం, విద్యార్థులకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పించడం ఇందులో ఉన్నాయి. వీటి ఫలితాలతో పాటు జిల్లాలో ఆ కార్యక్రమం అమలుకు మార్కులతో పాటు ర్యాంకులను శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో గుంటూరు జిల్లా మెరిసింది. పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖలు చేపట్టిన కార్యక్రమాలలో జిల్లాకు రాష్ట్ర వ్యాప్తంగా 8వ ర్యాంకు వచ్చింది. 14 సూచక(ఇండికేటర్స్)ల్లో జిల్లాకు 117 పాయింట్లు దక్కాయి. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో గుంటూరు జిల్లా తర్వాత స్థానం బాపట్లకు దక్కింది. 14 ఇండికేటర్స్‌లో బాపట్ల జిల్లాకు 115 పాయింట్లతో 9వ స్థానం నిలిచింది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల పురోగతిలో పల్నాడు జిల్లా వెనకబడింది. ఈ జిల్లాకు 14 ఇండికేటర్స్‌లో 103 పాయింట్లు రాగా 20వ ర్యాంకుకు పరిమితమైంది.

నేడు మరో కొత్త థీమ్‌తో..

ప్రతి నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర మిషన్ కార్యక్రమాన్ని సరికొత్త థీమ్‌తో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా నేడు (శనివారం) సరికొత్త థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణతో పాటు చెత్త నుంచి సంపద సృష్టి, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయడం ఈ థీమ్‌లో ప్రముఖంగా చేర్చారు. జిల్లాల పరిధిలోని అన్ని విభాగాల అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరగను న్నాయి. ప్రజలు, విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. ప్రతి విభాగానికి ఓ నోడల్ అధికారిని నియమించి పర్యవేక్షణ బాధ్యతలను వారికి అప్పగించి ఫలితాల విషయంలో వారిని జవాబుదారీవహించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

● యజ్ఞంలా స్వచ్ఛాంధ్ర



పంచాయతీరాజ్ శాఖతో పాటు మిగిలిన అన్ని శాఖలను కలుపుకుని ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం యజ్ఞంలా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన 14 సూచకలు అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించి ఆ ప్రకారం ముం దుకు వెళ్తున్నాం. నెలలో మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి విధిగా పాల్గొని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, పని ప్రాంతాల్లో పరిశుభ్రతను పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి మండలం, నియోజకవర్గంలో జరిగే ఈ కార్యక్రమాలను ప్రత్యేక అధికారు లు పర్యవేక్షిస్తారు.

- చొప్పర కృష్ణ,
డిప్యూటీ సీఈవో,
జిల్లా పరిషత్,
గుంటూరు



సీఆర్డీఏకు సవాలు

రాజధాని అమరావతిలో పనులు ప్రారంభమవుతున్నాయి.. అయితే రాజధానిలో ఆ పనుల పర్యవేక్షించే సీఆర్డీఏకు ప్రత్యేకంగా కార్యాలయం ఇప్పటికీ సమకూరలేదు. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించినా సీఆర్డీఏకు కార్యాలయ భవనం పనులు ఒక సవాల్‌గా మారాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకు స్థాపన జరిగి.. పనులు తుది దశకు చేరుకున్నా యి. అయితే వైసీపీ ప్రభుత్వ నిర్వాకం తో సీఆర్డీఏకు కార్యాలయం లేకుండా పోయింది. రాజధాని అమరావతిపై కక్ష సాధింపు క్రమంలో సీఆర్డీఏ భవనాన్ని మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతి పనులపై దృష్టి సారించింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్ర బాబు సీఆర్డీఏ కార్యాలయ పనులకు పునః శంకు స్థాపన చేశారు. రెండు నెలల్లో అందుబాటులోకి కార్యాలయం వచ్చి కార్యకలాపాలు ప్రారంభించాలని ఆదేశించి ఇప్పటికి నాలుగు నెలలు అవుతోంది. అయితే వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పనులు ఒక కొలిక్కి రావడం లేదు. పైగా అదనపు వ్యయంతో పాటు మాస్టర్ ప్లాన్ ప్రకా రం నిర్మాణాలకు సమయం వృథా అవుతోంది.

రాజధానిలో కార్యాలయానికి మోక్షమెప్పుడో?

- 2019లోనే తుది దశకు చేరినా వైసీపీ నిర్వాకంతో అస్తవ్యస్తం
- రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుందన్నా.. పనుల్లో తీవ్రజాప్యం
- మాస్టర్‌ప్లాన్ ప్రకారం పనులకు అదనపు వ్యయం, సమయం వృథా


సీఆర్డీఏ కార్యాలయం , ఇన్‌సెట్లో పని చేస్తున్న కార్మికులు

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సీఆర్డీఏ)దే కీలకపాత్ర. రాజధాని నిర్మాణానికి సంబంధించిన విధి, విధానాలన్నీ సీఆర్డీఏ పర్యవేక్షణలోనే ప్రాణం పోసుకుంటాయి. అమరావతి రూపురేఖలన్నీ ఇక్కడే రూపుదిద్దుకుంటాయి. అలాంటి కీలక సంస్థకు రాజధాని అమరావతిలో ఇప్పటికీ కార్యాలయం లేదు. 2014- 19 కాలంలోనే సీఆర్డీఏ కార్యాలయాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని భావించారు. అయితే ఇప్పటి వరకూ ఆ కార్యాలయం అందుబాటులోకి రాలేదు. అందుకు కారణం గత వైసీపీ ప్రభుత్వం నడిపిన కక్షా రాజకీయాలే. అమరావతిపై దుగ్ధతో నాటి జగన్ ప్రభుత్వం చేసిన విచ్ఛిన్నమే నేటికీ రాజధానిలో సీఆర్డీఏ కార్యాలయం లేకుండా పోవడానికి కారణమన్న విమర్శలు వస్తున్నాయి. నాడు జగన్ చేసిన విధ్వంసం, ఆ తాలూకా విచ్ఛిన్నకర చర్యలే నేటికీ రాజధానిని వెంటాడుతున్నాయి. ఆ కారణంగానే సీఆర్డీఏ కార్యాలయ భవన నిర్మాణ పనులు అంతకంతకూ జాప్యమవుతున్నాయి.

● పదేళ్ల క్రితం సీఆర్డీఏ ఏర్పాటు

సీఆర్డీఏను 2014 డిసెంబరు 30న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాజధాని నిర్మాణ ప్రక్రియ మొత్తం సీఆర్డీఏ పర్యవేక్షణలో జరగనున్న నేపథ్యంలో సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన రావిపూడిలో కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 3.62 ఎకరాల్లో ఏడు అంతస్తులు, 2.42 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారు. కార్యాలయం చుట్టూ 2.5 ఎకరాల్లో ఉద్యానవనం ఏర్పాటుకు పూనుకున్నారు. 2017లో రూ.160 కోట్ల అంచనాలతో సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి భవనం ఏడంతస్తులు స్లాబ్ వరకూ పూర్తి అయింది. ఫినిషింగ్, ఇంటీరియర్, విద్యుత్, తదితర పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. 80 శాతం పూర్తయిన ఆ పనులను జగన్ సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే ఆపేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆర్బీఐ కార్యాలయం ఏర్పాటుకు ఈ భవనాన్ని సూచించగా, అందుకు వారు అంగీకరించలేదు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఆ కార్పొరేషన్లకు కావాల్సిన కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి ఈ భవనాన్ని వాడుకోవాలని భావించారు. ఈ క్రమంలో సీఆర్డీఏ కార్యాలయ భవననమూనాను మార్చి 2023 కొత్తగా నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు ఆనిర్మాణాలే తలనొప్పిగా మారాయి.


సీఆర్డీఏ కార్యాలయం నిర్మాణ సామగ్రిని చేరవేస్తున్న కూలీలు

నాలుగు నెలలు ఆగాల్సిందేనా?

తుది దశకు చేరిన సీఆర్డీఏ కార్యాలయ భవనాన్ని వైసీపీ హయాంలో ఇష్టం వచ్చినట్లుగా మార్చేశారు. అరకొర పనులే మిగిలాయి వాటిని పూర్తి చేసి రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావించారు. అయి తే పనులు చేపట్టిన తర్వాత చూస్తే మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా జరిగిన పనులను తొలగించడం పెద్ద తలనొప్పిగా మారింది. అస్తవ్యస్త నిర్మాణాల తొలగింపు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేశారు. అయితే ఇంకా అంతకు మించి ఖర్చు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. నిర్విరామంగా పనిచేసినా మరో నాలుగు నెలల వరకూ కార్యాలయం అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

● ప్లాన్‌ను సరిదిద్దలేక పాట్లు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజదాని అమరావతి నిర్మాణంపై దృష్టి (మిగతా 6వ పేజీలో)

అనర్హులెవరు.. అమ్ముకున్నదెవరు?

- జగనన్న కాలనీ లేఅవుట్లలో అక్రమాలపై ఆరా
- 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించిన ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో జాబితాలను జల్లెడ పడుతున్న అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) పేదలకు స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించడమే తమ ఉద్దేశమని ప్రగల్భాలతో ప్రతి దశలోనూ నాటి జగన్ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో దోపిడీకి తెరతీసింది. స్థలాల సేకరణ నుంచి లబ్ధిదారుల ఎంపిక వరకు ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న విమర్శలు, ప్రతిపక్షాల ఆందోళనలను నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. అర్హతలు ఉండి గూడు లేని పేదలకు అరకొరగానే లబ్ధిచేకూర్చిన గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణంలో కూడా అనేక అవకతవకలకు తెరతీసింది. రాజకీయ అండతో స్థలం పొందిన వారు గతంలోనే అమ్ముకుని లబ్ధి పొందారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఈ అక్రమాలన్నింటిపై కొరడా ఝుళిపించడానికి కార్యాచరణ రూపొందించింది. దీనికి సంబంధించి కలెక్టర్లకు సీసీఎల్ఏ నాలుగు రోజుల క్రితమే ఆదేశాలు జారీ చేసింది. లే అవుట్లలో ఎంతమందికి పట్టాలిచ్చారు, వారిలో అర్హులెవరు, అనర్హులెవరు, ఇళ్లు నిర్మించుకున్నారా లేదా, ఎవరైనా అమ్ముకున్నారా అన్న వివరాలతో పాటు భూ సేకరణకు పెట్టిన ఖర్చులపై నివేదికను ఈ నెల 25లోగా అందించాలని సీసీఎల్ఏ కమిషనర్ ఆదేశించారు. దీంతో తహసీల్దార్ల పర్యవేక్షణలో మండల పరిధిలో రెవెన్యూ సిబ్బంది రంగంలోకి దిగి పరిశీలన చేపడుతున్నారు

ఇళ్ల స్థలాల లెక్క ఇలా..

జిల్లాలో మొత్తం 50,404 మందికి జగనన్న కాలనీల పేరిట వేసిన లేఅవుట్లలో స్థలాలు ఇచ్చినట్లు రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి. గుంటూరు జిల్లా పరిధిలో 247 లే అవుట్లలో 63,000 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. పల్నాడు జిల్లాలో 224 కాలనీలకు 39,000 మందికి లబ్ధి చేకూర్చినట్లు గత ప్రభుత్వం తెలిపింది. ఈ స్థలాల్లో ఇప్పటి వరకు 30 శాతం మంది కూడా ఇళ్లు కట్టుకోకపోగా, దాదాపు 20 శాతం మంది స్థలాలను అమ్ముకున్నట్లు క్షేత్రస్థాయి గణాంకాలు చెబుతున్నాయి. లబ్ధిదారుల్లో సగం మంది మాత్రమే అర్హులని, మిగిలిన వారంతా కూడా వైసీపీ నేతలు చెప్పినవారికి, లేదా వారి బినామీలు లబ్ధి పొందినట్లు ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చింది. సీసీఎల్ఏ ఆదేశాలతో లబ్ధిదారుల జాబితాను వడపోత పట్టే కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. పేదలే స్థలం పొంది ఇల్లు కట్టుకోలేక అమ్ముకుని ఉంటే వారికి మినహాయింపు ఇచ్చే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. అలా కాకుండా వైసీపీ నేతల పలుకుబడితో ఏ అర్హత లేకపోయినా పట్టా పొందడం, వాటిని అమ్ముకున్న వారి విషయంలో కఠిన చర్యలు తీసుకోవాడనికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీంతో ఆ సమయంలో రెవెన్యూ విభాగంలో కీలకంగా వ్యవహరించిన అదిదికారులతో పాటు అవకతవకలకు సూత్రధారులుగా వ్యవహరించిన వైసీపీ నేతల గుండెల్లో వణుకు మొదలైంది.

ఇబ్బడి ముబ్బడిగా ఫిర్యాదులు...

జగనన్న కాలనీల లేఅవట్లకు స్థల సేకరణ, లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయింపులో జరిగిన అవకతవకలపై గత ప్రభుత్వంలోనే అధికారులకు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. స్థలాల చదును పేరుతో చేసిన ఖర్చులోనూ అక్రమాలున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికారం అండతో వాటిని తొక్కిపెట్టి అక్రమార్కులు పబ్బం గడుపుకున్నారు. కర్లపాలెం మండల పరిధిలోని ఓ లేఅవుట్ స్థలం విషయంలో దాదాపు కోటిన్నర వరకు గోల్‌మాల్ జరిగినట్లు గతంలోనే ఆరోపణలు వచ్చాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వెచ్చించిన నిధులను మెరక చేయడానికి ఖర్చు చేసినట్లు లెక్కల్లో చూపి వైసీపీ నేతలు పెద్దఎత్తున లబ్ధి పొందారు. ఈ క్రమంలో చేయని పనులు చేసినట్లు యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి వైసీపీకి చెందిన ఓ కీలక నేత దాదాపు రూ.18 కోట్ల వరకు లబ్ధి పొందినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలో ఇళ్ల స్థలాల కేటాయింపులో భాగంగా ప్రాథమికంగా పరిశీలన చేపట్టగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 8,000 మంది స్థలాలు అమ్ముకోగా, దాదాపు 18,000 మంది అనర్హులకు లబ్ధి చేకూర్చినట్లు తేల్చారు. లే అవుట్లలో దాదాపు పదివేల ప్లాట్లు ఎవరికీ కేటాయించలేదని గుర్తించారు. ఈ క్రమంలో సీసీఎల్ఏ ఆదేశాలతో తహసీల్దార్ల కనుసన్నల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుంది. బాపట్ల జిల్లాలో 4,034 మందికి కేటాయించిన పట్టాలను పరిశీలించగా ఇందులో 180 వరకు అర్హత లేనట్లు గుర్తించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు పన్నెండు వేల ఇళ్ల పట్టాలను పరిశీలించగా 800 మందికి ఆయాచిత లబ్ధి చేకూర్చినట్లు గుర్తించారు.


చీరాల పరిధిలో వేసిన లేఅవుట్.. ఖాళీగా ఉన్న ప్లాట్లు


మాజీ సీఎం దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

దామోదరం సంజీవయ్యకు ఘనంగా నివాళులు

● మాజీ సీఎం సేవలను గుర్తుంచుకోవాలన్న కలెక్టర్, ఎస్పీ

బాపట్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీలు ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ 1960 జనవరి 11న ముఖ్యమంత్రిగా సంజీవయ్య ఎన్నిక ఆంధ్రప్రదేశ్ చరిత్రలో గొప్ప సంఘటనని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి రాజాదెబోరా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారి శివలీల, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు దామోదరం సంజీవయ్య అని కొనియాడారు. పిన్నవయస్సులోనే రాజకీయాల్లోకి ప్రవేశించి కేంద్ర, రాష్ట్ర క్యాబినెట్లలో మంత్రి పదవులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విఠలేశ్వర్, ఏవో శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఆర్ఐ మౌలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

ఈ నెల 18 తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బి. సింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీన వెంకటాపురం, శింగరకొండపాలెం, పేరాయపాలెం, 19 విప్పర్లవారిపాలెం, గోపాలపురం, జార్లపాలెం, 20 కొండపాడు, నాగులపాడు, వేలమూరిపాడు, 24 బొమ్మనంపాడు, ధర్మవరం, కోటికలపూడి, 25 మైలవరం, శంకవరప్పాడు, కుంకుపాడు, 27వ తేదీ ఉప్పలపాడు, కలవకూరు, తిమ్మయపాలెం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు జరుగుతాయని వివరించారు. ఈ క్యాంపులకు ఆయా గ్రామాల ప్రజలు సద్వియోగపర్చుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు, సిబ్బంది గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి, ప్రచారం చేయడంతో పాటు దాంటాం వేయించాలని తెలిపారు.

నేడు క్లస్టర్ సమావేశాలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 150 క్లస్టర్లలో ఈనెల సమావేశాలు శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించాలని డీఈవో కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్ నిర్వహణకు అవసరమైన ఐఎఫ్‌పీ, ప్యానల్స్, ఇంటర్‌నెట్ సదుపాయాలపై సమావేశాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్లస్టర్ పరిధిలో మ్యాపింగ్ చేసిన అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఇప్పటికే ప్రాథమిక, సెకండరీ క్లస్టర్ నిర్వహణకు సంబంధించిన అజెండా ప్రకారం అన్ని క్లస్టర్లలో సమావేశాలు నిర్వహించాలని, ఎవరికీ మినహాయింపు లేదని డీఈవో స్పష్టం చేశారు.

నేడు పాఠశాలల్లో 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'

జిల్లాలోని అన్ని యాజమాన్యాలలోని పాఠశాలల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని డీఈవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమం కాదు.. సక్రమమే

వంశీ అరెస్టుపై మంత్రి డోలా వ్యాఖ్య

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులకు కూటమి ప్రభుత్వం వ్యతిరేకమని, చట్టం తన పని తాను చేసుకుపోతోందని, పోలీసుల విచారణలో తప్పుచేసినట్లు తేలితేనే కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. గురువారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడా అ క్రమ అరెస్టులకు పాల్పడలేదన్నారు. వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన పేర్కొన్నారు.
చంద్రబాబునాయుడు ప్రభుత్వం విలువలకు కట్టుబడి పనిచేస్తుందని, టీడీపీ నాయకుల పట్ల గత ప్రభుత్వం వ్యవహరించినట్లు నేడు కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తే సగం మంది వైసీపీ నాయకులు జైళ్ల, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండేవారని ఆ యన వ్యాఖ్యానించారు. హామీ ఇచ్చిన మేరకు సూపర్ సిక్స్ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నామన్నారు.
జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది వరకు అమ్మఒడి పథకాన్ని అ మలు చేయలేదని ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాకముందే పథకాలపై దుష్ప్రచారం చేయటం వైసీపీ నాయకులకు తగదని ఆయన అన్నారు.

పునరావాసకాలనీల సమస్యలను వేగంగా పరిష్కరించండి

గుండ్లకమ్మ గేట్లకు త్వరలో నిధులు

పింఛన్లకు ఏటా రూ.33 వేల కోట్లు ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే

అభివృద్ధి పనులు నాణ్యతతో చేయకుంటే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టండి

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



యర్రబాలెంలో డ్రెయిన్లు, సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పరిధిలోని పునరావాసకాలనీల్లో నెలకొన్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. త్వరలో గుండ్లకమ్మ గేట్లకు నిధులు విడుదల అవుతాయని చెప్పారు. శుక్రవారం కొరిశపాడు మండలంలోని యర్రబాలెంలో అద్దంకి నియోజకవర్గంలోని ఏడు పునరావాస గ్రామాల ప్రజల సమస్యల గురించి అధికారులతో సమీక్షించారు. తొలుత యర్రబాలెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమీక్షంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో 64 లక్షల మంది పింఛన్‌దారులకు ఏటా 33 వేల కోట్ల రూపాయలు ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. గుండ్లకమ్మ పునరావాసకాలనీలో పనులను నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న దేవాలయాలను, రోడ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. యర్రబాలెం పునరావాసకాలనీ నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డును, తిమ్మనపాలెం నుంచి యర్రబాలెం వరకు వచ్చే రోడ్డును వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. యర్రబాలెంలో గతంలో నిర్మించిన సిమెంట్‌రోడ్లు అన్ని పగుళ్లు ఇచ్చాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత వైసీపీ ప్రభుత్వం గుండ్లకమ్మ ప్రాజెక్టునే కాదు నిర్వాసితులనూ ముంచిందని మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి ఆర్థిక అరాచకంతో రాష్ట్రం ఎంతో వెనుకబడిపోయిందన్నారు. ఈ పరిస్థితి నుంచి కోలుకోవాలంటే సమయం పడుతుందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత మెరుగుపడితే కొత్త పింఛన్లు ఇవ్వడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ పునరావాసకాలనీలలో చేసే పనులలో నాణ్యత పాటించని కాంట్రాక్టర్‌లను బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు బిల్లులు ఆపేయాలని చెప్పారు. అలాగే పనులు చేయించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్ నాయుడు, ఎస్‌డీసీ జ్యోతి, విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్ రావు, గుండ్లక మ్మ ప్రాజెక్టు ఈఈ శ్రీహరి, డీఈఈ కరిముల్లా, ఇరిగేషన్ ఈఈ ఎం. రవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, హౌసింగ్ డీఈ ఖాదర్ వలి, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమార్, సర్పంచ్ నాగరాజు, పీఆర్ ఏఈ ప్రసాద్, పునరావాసకాలనీ ప్రజలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఆర్డీఏకు సవాలు

(5వ పేజీ తరువాయి)

సారించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు 2019కి ముందు నిర్మించిన భవనాల పరిస్థితిని తెలుసుకోవడానికి రాజధానిలో పర్యటించారు. కిందటేడాది అక్టోబరు 20న జరిగిన ఆ పర్యటనలోనే ఆయన సీఆర్డీఏ భవన నిర్మాణాల పనులను పునఃప్రారంభించారు. మరో రెండు నెలల్లో సీఆర్డీఏ కార్యాలయం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ మాట చెప్పి ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నది. అయితే ఇప్పటికీ పనులు ముందుకు సాగలేదు. జగన్ హయాంలో చేపట్టిన నిర్మాణాలను తొలగించి, మాస్టర్‌ప్లాన్ ప్రకారం రూపొందించిన నమూనాను తీసుకురావడమే ప్రభుత్వానికి సవాలుగా మారింది. నాలుగు నెలలుగా అస్తవ్యస్త నిర్మాణాలను తొలగించడం, కార్యాలయం చుట్టూ ఉన్న ప్రాంగణాన్ని శుభ్రం చేయడానికే సమయం సరిపోతోంది. రాజధానిలో ఏర్పాటు చేస్తే అమరావతి నిర్మాణ పనులు మరింతగా పుంజుకుంటాయి. ప్రస్తుతం విజయవాడ నుంచి రాజధాని పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో నిర్ణయాలు, వాటి అమలులో తెలియకుండానే జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తక్షణం కార్యాలయం అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. అయితే పనులు మాత్రం అనుకున్నంత వేగంగా జరగడం లేదు. ముందుగా వేసిన అంచనాలను మించి అదనంగా వ్యయం చేయాల్సి వస్తోంది.



సీఆర్డీఏ కార్యాలయం ముందు గుంతలు పూడ్చేందుకు తోలిన మట్టి



సీఆర్డీఏ కార్యాలయం పనుల నిమిత్తం తెచ్చిన రెడీ మిక్స్ యంత్రం

నత్తనడకన 'అమృత్‌భారత్'

- రెండేళ్లుగా అరకొరగా పనులు
- దొనకొండ రైల్వేస్టేషన్ ముందు సిమెంట్ రోడ్లు, ప్లాట్‌ఫాంపై షెడ్ల పిల్లర్లతో సరిపెట్టిన వైనం



దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఓవర్‌బ్రిడ్జ్ నిమిత్తం ప్రస్తుతం తవ్విన పునాదులు

దొనకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ల అభివృద్ధి నిమిత్తం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్‌భారత్ పథకంలో దొనకొండ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. రైల్వేస్టేషన్ ముందు కొంతభాగం హడావుడిగా సిమెంట్ రోడ్ల పనులు చేపట్టి మిగిలిన పనులు నిలిపివేశారు. నిర్వాహకులు అప్పుడప్పుడు వచ్చి పనులు ప్రారంభించి హడావుడి చేయటం, తిరిగి కొన్నిరోజులు నిలిపివేయటం పరిపాటిగా మారింది. మిగిలిన రైల్వేస్టేషన్లల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నా.. దొనకొండలో మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.

చిన్న రైల్వేస్టేషన్లు సైతం మహానగరాల్లోని రైల్వేస్టేషన్లతో దీటుగా ఉండాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఆధునికీకరణ చేపట్టింది. ఇందుకుసంబంధించి ప్రవేశపెట్టిన అమృత్‌భారత్ పథకంలో దొనకొండ రైల్వేస్టేషన్ ఎంపికైంది. ఈస్టేషన్‌లో దాదాపు రూ.18 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023 ఆగస్టు 6న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమాన్ని రైల్వే అధికారులు ఎంతో ఆర్భాటంగా నాడు నిర్వహించారు.
ఈసందర్భంగా అప్పటి గుంటూరు రైల్వే డివిజనల్ అసిస్టెంట్ మేనేజర్ ఆర్.శ్రీనివాస్ అమృత్‌భారత్ పథకం ఉద్దేశం, చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 2024 మార్చి నాటికి యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులను పూర్తిచేస్తామని ప్రకటించారు.

అమృత్ భారత్ పథకంలో దొనకొండ రైల్వేస్టేషన్ ముందుభాగం ఏవిధంగా రూపుదిద్దుకుంటుందో నమూనా చిత్రాన్ని అప్పట్లో రైల్వేస్టేషన్ ఆవరణలో పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి ప్రదర్శించారు. అయితే, నత్తనడకన జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా చూస్తున్న ప్రజలు రైల్వే అధికారులు ప్రకటించిన విధంగా దొనకొండ రైల్వేస్టేషన్ అభివృద్ధి చెందుతుందా? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అమృత్ భారత్ పథకంలో దొనకొండ రైల్వేస్టేషన్‌లో ముందుభాగంలో అధునాతన వెలివేషన్, ప్లాట్‌ఫాం ఆధునికీకరణ, షెడ్లు ఏర్పాటు, లిఫ్ట్ సౌకర్యంతో పుట్ ఓవర్ బ్రిడ్జి, ప్రయాణికుల సౌకర్యార్థం అధునాతన వెయిటింగ్ హాల్ తదితర పూర్తి సౌకర్యాలు ఏర్పాటవుతాయని రైల్వే అధికారులు వెల్లడించారు. శంకుస్థాపన చేసి దాదాపు రెండేళ్లు గడుస్తున్నా కొద్దిపాటి సిమెంట్ రోడ్లు, ప్లాట్‌ఫాంపై షెడ్ల నిమిత్తం



దొనకొండ రైల్వేస్టేషన్ నమూనా

ఏర్పాటుచేసిన పిల్లర్లు మినహా ఎటువంటి పనులు జరగలేదు. ఇప్పటికైనా రైల్వే అధికారులు అమృత్ భారత్ పథకంలో ఎంపికైన దొనకొండ రైల్వేస్టేషన్‌కు మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో కేటాయించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అలా పంచేశారు...

కూటమి పాలనలోనూ వైసీపీ కార్యకర్తలకు పండగ

ఏడాది క్రితం చేసిన జడ్పీ పనులకు బిల్లులు

వారికే సహకరిస్తున్న ప్రస్తుత అధికారులు

గత టీడీపీ పాలనలో చేసిన వాటికి నేటికీ రాని వైనం

ప్రభుత్వ తీరుపట్ల రగిలిపోతున్న తమ్ముళ్లు

టీడీపీ కూటమి పాలనలో వైసీపీ కార్యకర్తలకు పండుగ నెలకొంది. ఏడాది క్రితం వారు చేసిన జడ్పీ పనులకు పూర్తిగా బిల్లుల చెల్లింపులు జరిగాయి. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు ఇప్పటివరకు బిల్లులు రాలేదు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నూరు శాతం నిధులతో చేసిన పనులకు కూడా గత ఏడేళ్లుగా బిల్లులు రాక తమ్ముళ్లు తీవ్రంగా నష్టపోయారు. దీంతో టీడీపీ కేడర్ ప్రభుత్వ తీరు పట్ల ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ప్రస్తుతం వైసీపీ అధికారంలో ఉందా, టీడీపీ అధికారంలో ఉందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పలువురు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.



జడ్పీ నిధులతో తూర్పువెంకటాపురంలో పొలాల్లో నామమాత్రంగా రోడ్డు మరమ్మతులు(ఫైల్)

దర్శి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా జడ్పీ నిధుల కేటాయింపు పరిశీలిస్తే అగ్రతాంబూలం దర్శి నియోజకవర్గానికే దక్కుతుంది. దర్శికి కుమారుడిని పోటీ చేయించాలనే ముందుచూపుతో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధిక నిధులు కేటాయించారు. 2019 నుంచి 2024 వరకు రూ.18.60 కోట్ల నిధులను 362 పనులకు కేటాయించారు. ఎన్నికలకు ముందు 2023-24 ఒక్క సంవత్సరంలోనే అందులో 172 పనులు కేటాయించటం విశేషం. మొత్తం 362 పనుల్లో 345 పనులు పూర్తయ్యాయి. 17 పనులు ప్రారంభించలేదు. చేసిన 345 పనులకు రూ.13.15 కోట్ల బిల్లులు ఇప్పటికే చెల్లించారు. పనులు చేసిన వైసీపీ కార్యకర్తలకు అధికారులు చెక్కులు రాసివ్వటంతో మార్చుకొని ఆనందంగా ఉన్నారు. గత ఏడు సంవత్సరాల క్రితం చేసిన పనులకు బిల్లుల కోసం ఎదురుచూస్తున్న టీడీపీ కేడర్ ఈ పరిస్థితి చూసి అవాక్కవుతున్నారు. తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సతమతం అవుతున్నారు.

పనుల కేటాయింపులో నిబంధనలకు పాతర

జిల్లా పరిషత్ నిధులతో పనులు కేటాయింపులో నిబంధనలకు పాతర వేశారు. మౌలిక సూత్రాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా 90శాతం మట్టి పనులు కేటాయించారు. అధికారులు కూడా నోరు మెదపకుండా ఆమోదముద్ర వేశారు. ఆ పనులను వైసీపీ కార్యకర్తలకు పందేరం చేయటంతో నామమాత్రంగా నాలుగు తట్టలు మట్టి పోసి మమ అనిపించారు. పనులు ఎంతమేరకు చేశారనే విషయాన్ని పరిశీలించకుండా అధికారులు పూర్తిగా పనులు చేసినట్లు బిల్లులు చేశారు. ఊహించని విధంగా అరకొర పనులకు కూడా నిధులు విడుదలై చెక్కులు చేతికి రావటంతో వైసీపీ కేడర్ ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఉదాహరణకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టిన వారికి రూ.7.5లక్షల వరకు రావటంతో వైసీపీ కార్యకర్తలు హుషారుగా తిరుగుతున్నారు.

ఫిర్యాదులు, పట్టించుకోని అధికారులు

జడ్పీ పనుల కేటాయింపు, నిర్వహణలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ కమిటీ వేసి వాస్తవాలు నిగ్గుతేల్చాలని టీడీపీ నాయకులు పలుసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ జిల్లా అధికారులు పట్టించుకోలేదు. పనులు కేటాయించిన జడ్పీ సీఈవో ఎన్నికల అనంతరం బదిలీ అయ్యారు. ఆ తర్వాత వచ్చిన అధికారి పనుల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటాడని భావించినప్పటికీ ఆయన కూడా వైసీపీకి అనుకూలంగానే వ్యవహరించి నిధుల విడుదలకు బాగా సహకరించారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జడ్పీ పనుల కేటాయింపులో జరిగిన అక్రమాలు, బిల్లుల చెల్లింపులపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వివరించి తప్పుచేసిన అధికారులపై తగిన చర్యలు తీసుకునే విధంగా ఒత్తిడి తీసుకురావాలని టీడీపీ నాయకులు భావిస్తున్నారు.

అవీఇవీ

మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో స్టెమీ ఇంజక్షన్లు అందుబాటులో..

మార్టూరు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి) : మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో గుండెనొప్పికి గురైన వారికి అందించే 40 వేలు రూపాయల విలువైన స్టెమీ ఇంజక్షన్ అందుబాటులో ఉందని సూపరింటెడెంట్ డాక్టర్ విష్ణుతేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండెపోటుకు గురైనవారికి తొలిగంటలో అందించే ఇంజక్షన్ వారి ప్రాణాలును కాపాడుతుందని, ఉచితంగా వారికి ఇంజక్షన్ చేస్తామని వివరించారు. అంతేగాకుండా వారి కోసం ప్రత్యేక గదిని, బెడ్లు, టెస్టింగ్ పరికరాలను ఏర్పాటుచేశామని తెలిపారు.

రీసర్వేలో పొరపాట్లు దొర్లనివ్వొద్దు



దైవాలరావూరులో రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్, తహసీల్దార్ సుబ్బారెడ్డి

మేదరమెట్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : రీసర్వేను రైతుల సమక్షంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్‌నాయుడు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని దైవాలరావూరులో జరుగుతున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో రీ సర్వేలో జరిగిన తప్పులను పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు సమక్షంలో భూముల కొలతలు చేయడం వలన పొరపాట్లు జరగవని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, రీ సర్వే డీటీ రవికాంత్, మండల సర్వేయర్ మహేష్‌బాబు, వీఆర్‌వో నరసింహారావు, మారుతి, నారాయణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి

మేదరమెట్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి చెప్పారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. రానున్న వేసవి దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చేతిబోర్లకు మరమ్మతులు చేయించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు వారి అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు తుళ్లూరి వెంకటరమణ, ఎంపీడీవో రాజ్యాలక్ష్మి పాల్గొన్నారు.

వ్యర్థాల నుంచి విముక్తి

(5వ పేజీ తరువాయి)

తగు సవరణల ద్వారా ప్రభుత్వాస్పత్రులు వ్యర్థాల్ని వదిలించుకునే వెసులుబాటు కల్పించారు. ప్రభుత్వ సర్వ జనాసుపత్రులు జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వాటి స్థాయిలోనే పేరుకుపోయిన వ్యర్థాల్ని వదిలించుకోవచ్చు. ఈ మేరకు వివిధ ఆస్పత్రుల స్థాయిలో వ్యర్థాల నిర్ధారణ, వాటి వేలం నిర్వహణకు కమిటీల ఏర్పాటుపై నియమాల్ని రూపొందించారు. ఇప్పటివరకు పేరుకుపోయిన వ్యర్థాల్ని కొత్త నిబంధనల ప్రకారం 45 రోజుల్లో వదిలించుకోవాలి. అనంతరం ఈ ప్రక్రియను ప్రతి ఏడాది చేపట్టాలి. తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఖాతాలో జమచేయాలి. ఆస్పత్రుల వారీగా పేరుకుపోయిన వ్యర్థాల విలువను అంచనా వేయాలని బయో మెడికల్ ఇంజనీర్లను ప్రభుత్వం ఆదేశించింది. డిస్పోజల్ ద్వారా రూ.25 వేలు మించి ఆదాయం వచ్చే అవకాశం ఉంటే 'కొనుగోలు' ఈ ఆక్షన్ పోర్టల్ ద్వారా వేలం వేయాలి. లేకుంటే కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన మెటల్ స్క్రాప్ ట్రేడింగ్ కార్పొరేషన్ ద్వారా విక్రయించాలి.

20న విద్యుత్ మీటర్స్ రీడర్ల మహాసభ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 20వతేదీన విద్యుత్ మీటర్స్ రీడర్ల రాష్ట్ర ప్రథమ మహాసభ జరుగుతుందని ఏఐటీయూసీ నగర నాయకుడు శ్రీరామ్ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శుక్రవారం ఈ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ శాఖలో గత 15 ఏళ్ళ నుంచి పనిచేస్తున్న మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మీటర్ రీడర్స్ యూనియన్ కార్యదర్శి సిద్ధయ్య మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చిన తరుణంలో మీటర్స్ రీడర్ల ఉపాధి దెబ్బతినే పరిస్థితి నెలకొందన్నారు. మహాసభకు జిల్లాలోని విద్యుత్ మీటర్స్ రీడర్స్ అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాల్యాద్రి, పి.పిచ్చయ్య, దత్తు, మధు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా బ్యాంకర్స్ యూనియన్ అధ్యక్షుడు కె.రాజీవ్‌రతన్‌దేవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలు నగరం నెల్లూరు బస్టాండ్ వద్ద ఉన్న యూనియన్ బ్యాంక్ ఎదుట యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌రతన్‌దేవ్ మాట్లాడుతూ బ్యాంకుల్లో తాత్కాలిక పద్ధతిలో పనిచేసే ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. బ్యాంకుల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమించాలన్నారు. వారానికి ఐదు పనిదినాలు మాత్రమే ఉండాలని కోరారు. పలు బ్యాంకుల్లో పని చేసే ఉద్యోగులకు ఎలాంటి మార్పులు లేకుండా పెన్షన్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. గతంలో కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలు బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

గృహ హింస చట్టం కింద కేసు

కొత్తపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భర్త, అత్తమామలు తనను వేధిస్తున్నారని, హింసకు గురిచేస్తున్నారంటూ మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన షేక్ పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపట్నం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. భర్త బాజి, అతని తల్లిదండ్రులపై గృహ హింస చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

నిధులు పక్కదారి పట్టించడంపై చర్యలు

చినకొత్తపల్లిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

వైసీపీ ప్రభుత్వంలో ఆ నిధులు ఇతరులకు చెల్లింపు

చెక్ రూపేణ చెల్లించాల్సిన రూ.15.74 లక్షలను నేరుగా డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్

తాజా విచారణలో నిధులు కాజేసినట్లు గుర్తింపు

సర్పంచ్ చెక్ పవర్ 3 నెలల పాటు రద్దు

అప్పటి పంచాయతీ కార్యదర్శిపై వేటుకు రంగం సిద్ధం



చినకొత్తపల్లిలో ఉపాధి నిధులతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సీసీ రోడ్డు

అద్దంకి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వం హయాంలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేసిన పనులకు సంబంధించిన బిల్లులను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పక్కదారి పట్టించిన ఘటనపై అధికారులు చర్యలు ప్రారంభించారు. వైసీపీ సానుభూతిపరురాలైన సర్పంచ్, వైసీపీ నేతలు చెప్పినట్లే విన్న అప్పటి పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా సొంతంగా డ్రా చేసి తమకు అనుకూలమైన వ్యక్తికి ముట్టజెప్పారు. ఆ ఉదంతానికి సంబంధించి సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయగా, అప్పటి పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు రంగం సిద్ధమైంది. వివరాల్లోకెళ్తే... అద్దంకి మండలంలోని చినకొత్తపల్లిలో టీడీపీ నాయకుడు మానం మురళీమోహన్‌దాస్ చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలోని చినకొత్తపల్లి, శ్రీనివాస నగర్‌లలో 2018-19లో 50 లక్షల రూపాయల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు నిర్మించారు. ఈ పనులకు సంబంధించి టీడీపీ నేత మానం మురళీ మోహన్‌దాస్ 30 శాతం మెటీరియల్ కాంపొనెంట్ కింద 15,74,283 రూపాయల విలువైన సామగ్రి సరఫరా చేశారు. అందుకు సంబంధించి 2021 సెప్టెంబరు 3వ తేదీ 15,74,283 రూపాయలు ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. ఈ నిధులను మురళీమోహన్‌దాస్‌కు చెల్లించాల్సి ఉండగా అప్పటిపంచాయతీ కార్యదర్శి(ప్రస్తుతంసంతమాగులూరు మండలం పాతమాగులూరు పంచాయతీ కార్యదర్శి) ఈశ్వరరెడ్డి, సర్పంచ్ గుజ్జుల మల్లికలు నేరుగా డ్రా చేసి సర్పంచ్ సోదరుడు చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించారని మురళీమోహన్‌దాస్ అప్పట్లోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చీరాల డీఎల్‌పీవో శివనారాయణ గతేడాది డిసెంబరు 18వ తేదీ విచారణ చేపట్టి సర్పంచ్ గుజ్జుల మల్లికరెడ్డి, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిలు బ్యాంక్ నుంచి నేరుగా డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక అందజేశారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలకు సంజాయిషీ నోటీస్‌లు జారీ చేశారు. నోటీస్‌కు సర్పంచ్ మల్లిక ఇచ్చిన సమాధానంపై సంతృప్తి చెందని జిల్లా పంచాయతీ అధికారి 3 నెలల పాటు సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు రెండు రోజుల క్రితం ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిపై వేటుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. అదే సమయంలో పనులు చేయకుండా డబ్బులు తీసుకున్న సర్పంచ్ సోదరుడు చంద్రగిరి వీరారెడ్డిపై కూడా చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎట్టకేలకు టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ పోరాటం ఫలించి అధికారం అడ్డుపెట్టుకొని డబ్బులు డ్రా చేసిన సర్పంచ్ గుజ్జుల మల్లిక చెక్ పవర్ రద్దు కాగా, మిగిలిన ఇద్దరిపై చర్యలకు రంగం సిద్ధమైంది.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

చినగంజాం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లెపాలెంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శేరు వంశస్థుల ఇలవేల్పు అయిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రథమ వారికోత్సవం సందర్భంగా అర్చకులు మాజేటి శ్రీనివాసశర్మ, మురళీ శర్మల ఆధ్వర్యంలో స్వామిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తదనంతరం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో వేదమంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా దంపతులచే స్వామి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. రాత్రికి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవాన్ని గ్రామంలోని పురవీధుల్లో మేళతాళాలతో, మంగళ వాయిద్యాలు, కళా నృత్యాలు, బాణసంచా కాంతులతో గ్రామోత్సవం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం

చీరాలటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గాంధీనగర్, ఆనందపేట, శాంతినగర్, మసీదు సెంటర్, సాయికాలనీ, రామనగర్, విజయనగర్‌కాలనీ, ఆదినారాయణపురం, బోయినవారిపాలెం, అలాగే వేటపాలెం మండల పరిధిలో కొత్తపేట, కొత్తరెడ్డిపాలెం, రామచంద్రపురం, చల్లారెడ్డిపాలెం, అక్కయ్యపాలెం, లక్ష్మీపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం ప్రాంతాలలో విద్యుత్ కట్ అవుతుందని పేర్కొన్నారు.

చీరాల బులియన్ మర్చంట్ కమిటీ అధ్యక్షుడిగా సురేష్

చీరాలటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షులుగా తులాబంధు సురేష్, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా నరసింహస్వామి, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునరావు, మురళీకృష్ణ, ఉప కార్యదర్శిగా నాగరాజురెడ్డిలను ఎన్నుకున్నారు.

తడి చెత్త, పొడి చెత్త సేకరించండి

పంగులూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. ప్రతి నెల మూడవ శనివారం గ్రామ పంచాయితీ పరిధిలో సోర్స్ రీసోర్స్ కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ నిర్వహించాలని పంచాయతీ సిబ్బందికి ఎంపీడీవో సూచించారు.

పతనమవుతున్న మిర్చి ధర..

అరకొరగా దిగుబడులు

నైరాశ్యంలో మిర్చి రైతులు

పర్చూరు వ్యవసాయ డివిజన్‌లో 20 వేల ఎకరాలకుపైగా సాగు



నూతలపాడు సమీపంలో కల్లాల్లో ఎండబెట్టిన మిర్చి



కల్లాల్లోని తాలుకాయలను వేరు చేస్తున్న కూలీలు

పర్చూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మిర్చి రైతులకు కన్నీళ్లొస్తున్నాయి. రోజురోజుకూ పతనం అవుతున్న ధరను తలుచుకుని ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. ఏడాది క్రితం ధరతో పోలిస్తే ప్రస్తుతం సగం కూడా లేదు. పాత నిల్వలు ఉన్నాయన్న సాకుతో వ్యాపారులు మరీ తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈఏడాది మిర్చి సాగు ప్రారంభంలోనే తెగుళ్లు వెంటాడాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడినా ఫలితం లేకుండా పోయింది. బొబ్బర తెగులు, నల్లనల్లితో మిర్చి తోటలు గణనీయంగా దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడులు నామమాత్రంగానే ఉన్నాయి.

ఎకరాకు రూ.2 లక్షల వరకు ఖర్చు

పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు మండలాల్లో దాదాపు 20వేల ఎకరాలకు పైగా రైతులు మిర్చి పంటను సాగుచేస్తున్నారు. ఇప్పటికే కౌలు, వ్యవసాయ ఖర్చులు, ఆరుతడులు కలుపుకొని ఎకరానికి రూ.2లక్షలకు పైనే ఖర్చు పెట్టారు. ప్రస్తుతం వస్తున్న దిగుబడులు చూస్తుంటే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ధరలకు కూడా లేకపోవటంతో సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో పాలుపోవటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిల్వల పేరుతో తగ్గించి కొనుగోలు

పాత నిల్వలు ఉన్నాయన్న సాకుతో వ్యాపారులు మరీ తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. చేతికి అందివచ్చిన అరకొర దిగుబడులను అమ్ముకుందామన్నా పడిపోయిన ధరను చూస్తుంటే భయమేస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం క్వింటా ధర రూ.10వేలకు మించి లేదు. దిగుబడులు కూడా ఎకరానికి పది క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదు. గత ఏడాది ఇదే మిర్చి క్వింటాకు రెట్టింపు ధర ఉండటం గమనార్హం. ఈఏడాది మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన కూలి రేట్లు కూడా గణనీయంగా పెరిగాయి. దీంతో ఎకరానికి లక్ష రూపాయల మేర నష్టపోవాల్సి వస్తుందని రైతులు దిగాలు చెందుతున్నారు.

దేవుడి డబ్బులు డ్రా.. ఉద్యోగికి జైలు

ఇంకొల్లు/పర్చూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : దేవుడి సొమ్మును తన సొంత అవసరాలకు వినియోగించుకొని భగవంతుడికే శఠగోపరం పెట్టిన దేవదాయశాఖ ఉద్యోగి శివప్రసాద్‌కు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించిందని ఎస్సై సురేష్ చెప్పారు. మండలంలోని ఇడుపులపాడు గ్రామంలో ఉన్న చెన్నకేశవస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పనిచేసిన నూతలపాటి శివప్రసాద్ 2017లో ఇడుపులపాడులోని సిండికేట్‌బ్యాంకులో ఉన్న ఆలయ సొమ్ము రూ.6,54,650లను అక్రమంగా డ్రాచేయడంతో అప్పటి ఈవో దామా నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఇంకొల్లు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలోని శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామి ఆలయంతోపాటు, తిమ్మరాజుపాలెంలోని గోరంట్ల వెంకన్న ట్రస్ట్‌కు సంబంధించిన నిధుల గోల్‌మాల్‌పై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి పర్చూరు కోర్టులో న్యాయాధికారి శాంతి గురువారం విచారణ చేశారు. శివప్రసాద్ నేరం చేసినట్లు సాక్ష్యాలు ఉండడంతో రెండేళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.30 వేల జరిమానా విధించారు.

విజ్ఞానయాత్రతో విద్యార్థులకు మానసికవికాసం

ఇంకొల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞానయాత్రలు మానసిక వికాసం కలిగిస్తాయని ఆదర్శస్కూల్ డైరెక్టర్ విజయభాస్కర్ చెప్పారు. ఆ పాఠశాల విద్యార్థులను స్థానికంగా ఉన్న విద్యా పాలఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. పాలసేకరణ, శీతలీకరణ గురించి అవగాహన కలిగించారు.

తల్లి పాలపై అవగాహన పెంచాలి

బల్లికురవ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డలకు తల్లి పాలు తాగించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులకు అవగాహన కల్పించాలని కొప్పెరపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి మమత చెప్పారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో రెండోరోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ పడాయిబీపై శిక్షణ ఇచ్చారు. సీడీపీవో సుధ పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై శిక్షణ



మాట్లాడుతున్న వైద్యాధికారిణి మమత

సంతమాగులూరు, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని ఏల్చూరు గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు చిన్నారుల పోషణపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో సుధా తెలిపారు. రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పిల్లల పెరుగుదల, పర్యవేక్షణ, వెయ్యి రోజుల సంరక్షణ, పిల్లలకు ఇవ్వాల్సిన ఆహారం, తల్లి పాల లోప పోషణకు గురికాకుండా పిల్లలను సంరక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

కంటి విషయంలో జాగ్రత్త వహించాలి

పంగులూరు, ఫిబ్రవరి 14((ఆంధ్రజ్యోతి): కంటి విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ బాషా చెప్పారు. మండలంలోని బూదవాడ గ్రామంలో శుక్రవారం జరిగిన ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్యాలయం వారి సహకారంతో గొట్టిపాటి యూత్ ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో 89 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 71 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరంగా గుర్తించారు. వీరందరికీ కారంచేడు గ్రామంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్యాలయంలో ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వైద్య సహాయకులు నాగరాజు పాల్గొన్నారు.

పోషకాల ఆహారం తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సాయిశ్రీచరణ్

చినగంజాం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీ చరణ్ చెప్పారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలైన పోషణ్ భీ, పడాయ్ భీపై రెండో రోజైన ఇంకొల్లు సెక్టార్ పరిధిలోని ఇంకొల్లు, చినగంజాం మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. తీవ్ర పోషకాహార లోపం ఉన్న వారిని ఎన్‌ఆర్‌సీకి రిఫర్ చేయాలని వైద్యాధికారి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. పోషకాహార లోపం వలన కలిగే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లి పాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కే రామారావు, సీడీపీవో టీ ఝాన్సీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వాణిశ్రీ, సుమలత, ఉషాకుమారి, చినగంజాం, ఇంకొల్లు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నారాయణను పరామర్శించిన మంత్రి

అద్దంకి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాల మాజీ సర్పంచ్ పాపసాని నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యచికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటుండగా విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

త్వరలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

పూర్తిగా శిథిలావస్థకు చేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న శాంతినగర్-మైలవరం-వి.కొప్పెరపాడు రోడ్డుకు త్వరలో నిధులు మంజూరవుతాయని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. వెంపరాలకు వచ్చిన మంత్రి దృష్టికి గ్రామస్థులు రోడ్డు సమస్యను వివరించారు. ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, త్వరలో నిధులు విడుదల అవుతాయని తెలిపారు. టీడీపీ నేతలు కరి పరమేష్, సర్పంచ్ పౌల్, మాజీ ఎంపీటీసీ భైరపునేని రామలింగయ్య, కంచర్ల వెంకటరావు, మాదాల సురేష్, సయింపు సురేష్ తదితరులు ఉన్నారు.

చీడపీడలపై రైతులకు అవగాహన



బొప్పాయి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంతమాగులూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మాలపాడు, మామిళ్లపల్లి గ్రామాలలో మిరప, బొప్పాయి పంటలు సాగు చేసే రైతులకు శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. తామరపురుగు, కాయకుల్లు, ఆకుమచ్చ తెగ్గులు, పూత రాలిపోవడం లాంటి సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానాధికారి హనుమంతు నాయక్, హార్టికల్చర్ కన్సల్టెంట్ విష్ణుమూర్తి, రైతు సేవాకేంద్రం సిబ్బంది రవి కిరణ్ పాల్గొన్నారు.

అవీఇవీ

నిషేధిత జాబితాలో ఉన్న భూముల పరిశీలన

ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం



దేవదాయశాఖ పరిధిలో భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

పర్చూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : నిషేధిత జాబితాలో ఉన్న ఎండోమెంట్ భూములను, గ్రామ కంఠం నుంచి సబ్ డివిజన్ చేసి రైతులకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ కె.బ్రహ్మయ్య నేతృత్వంలో సిబ్బంది శుక్రవారం పర్చూరు, నూతలపాడు గ్రామంలోని దేవాలయ భూములను పరిశీలించారు. గతంలో కొంత మంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రయివేట్ భూములను కూడా దేవదాయ శాఖకు చెందినట్లు జాబితాలో పొందుపరిచారు. దీంతో ఆ భూములు రిజిస్ట్రేషన్‌లు కాక అమ్మలేక ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. దీనిపై స్పందించిన అధికారులు నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించే విధంగా క్షేత్రస్థాయిలో పరిశీలన కార్యక్రమానికి స్వీకారం చుట్టారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని దేవదాయశాఖ భూముల పరిశీలనలో అధికారులు ఉన్నారు.

దామోదరం సంజీవయ్యకి ఘన నివాళి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం రోటరీ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, చిన్నిమురళీకృష్ణ, శివకుమారి, శ్రీలక్ష్మి, వెంకటేశ్వర్లు, పూర్ణచంద్రరావు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తా

నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డాక్టరు మహేంద్రనాథ్



ప్రజలతో మాట్లాడుతున్న మహేంద్రనాథ్

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డాక్టరు మహేంద్రనాథ్ చెప్పారు. శుక్రవారం వేటపాలెం మండల పరిధిలోని కఠారిపాలెం గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తాగు నీరు, రహదారులు విద్యుత్ సమస్యలను మహేంద్రనాథ్ దృష్టికి తీసుకొచ్చారు. సముద్రతీరంలో వేటకు వెళ్లేందుకు ఉన్న డొంకలో రహదారి నిర్మాణం చేయాలని కోరారు. వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే దేశాయిపేట గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ గోమాత ప్రేమికుల దినోత్సవం

చీరాలటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాపరాజుతోటలోని శ్రీకృష్ణ గోశాలలో శుక్రవారం ఘనంగా ప్రపంచ గోమాత ప్రేమికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు నెలవన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవకీ సుబ్బారావు, నీరుకట్టు నరసింహారావు, చంద్ర, శ్రీనివాసరావు, టి.చంద్ర, నాగేశ్వరరావు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న పరిషత్ ప్రతినిధులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : 2019లో పూల్వామా ఘటనపై చనిపోయిన భారత సీఆర్పీఎఫ్ జవాన్ల త్యాగాలు మరువలేనివని అఖిల భారత విద్యార్థి పరిషత్ చీరాల శాఖ ప్రతినిధులు చెప్పారు. చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలో శుక్రవారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించి అమర వీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మణికంఠ, వెంకటేష్, తరుణ్, మురళీ కృష్ణ, చంద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు ప్రారంభం

ఇంకొల్లు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.7 కోట్లతో జరిగిన పనులపై సామాజిక తనిఖీ అధికారులు పరిశీలిస్తున్నట్లు ఏపీవో రేణుకా చెప్పారు. గురువారం నుంచి గ్రామాల వారీగా ప్రారంభమై ఈ నెల 25వ తేదీ వరకు సామాజిక తనిఖీలు కొనసాగిస్తారన్నారు. అనంతరం మండల అభివృద్ధి కార్యాలయం వద్ద గ్రామసభ జరుగుతుందని తెలిపారు.

పేద మహిళకు సాయం

మార్టూరు, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు పంచాయతీ పరిధిలోని నేతాజీనగర్‌లో అనారోగ్యంతో బాధపడుతూ పేద కుటుంబానికి చెందిన అనూరాధకు శుక్రవారం హెల్పింగ్ హ్యాండ్స్ వారు ఆర్థిక సహాయం అందజేశారు. అంతేగాకుండా నిత్యావసర వస్తువులను కూడా అందించారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఖాదర్‌వలి, పుట్టా వెంకటేశ్వర్లు, దరువూరి సుబ్బారావు, సకల ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

పంగులూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయని ఎంఈవో కె.నాగభూషణం తెలిపారు. పంగులూరు, కొండమంజులూరు, చందలూరు ఉన్నత పాఠశాలల్లో జరిగే ఈ కాంప్లెక్స్ సమావేశాలకు ఆయా కాంప్లెక్స్‌ల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులందరూ విధిగా హాజరు కావాలని ఎంఈవో కోరారు.